తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | శుక్రవారం - 08 - మే - 2026 | సంపుటి : 3 | సంచిక : 340 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in




# హత్య చేసేందుకు కుట్ర చేశారు: కౌశిక్ రెడ్డి

**కరీంనగర్ ఘటనపై సంచలన ఆరోపణలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే**

**బీజేపీ కార్యకర్తల దాడిలో కారు ధ్వంసమైందని వెల్లడి**

**రేవంత్ రెడ్డి, బండి సంజయ్‌పై తీవ్ర విమర్శలు**

**కరీంనగర్, మే 07 (తెలంగాణ ముచ్చట్లు):**

కరీంనగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంపు కార్యాలయంపై బీజేపీ శ్రేణులు దాడి చేసిన ఘటన రాజకీయంగా కలకలం రేపుతోంది. ఈ ఘటనలో మరో బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కారును కూడా ధ్వంసం చేసినట్లు సమాచారం. దాడి అనంతరం మీడియాతో మాట్లాడిన కౌశిక్ రెడ్డి తనను పక్కా ప్రణాళికతో హత్య చేసేందుకు యత్నించారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్ ఇద్దరూ కుమ్మక్కయ్యారని సంచలన వ్యాఖ్యలు చేశారు.

మిగతా 2లో..



# ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలం

చౌటుప్పల్ మార్కెట్‌లో హరీశ్ రావు విమర్శలు

రైతులను తరుగు పేరుతో దోచుకుంటున్నారని ఆరోపణ

యుద్ధ ప్రాతిపదికన కొనుగోళ్లు చేపట్టాలని డిమాండ్

**యాదాద్రి భువనగిరి, మే 07 (తెలంగాణ ముచ్చట్లు):**

రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు మండిపడ్డారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం సందర్శించిన ఆయన రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ వడ్ల కుప్పల వద్ద రైతుల గుండెలు ఆగిపోతున్నా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కనీస కనికరం లేదని విమర్శించారు. కేసీఆర్ హయాంలో తెలంగాణలో ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ చూడలేదన్నారు.

మిగతా 2లో..



# మహిళా సంఘాలకు వడ్డీలేని రుణ పరిమితి పెంపు

- రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచిన తెలంగాణ ప్రభుత్వం
- రుణాల వడ్డీని ప్రభుత్వమే భరిస్తుందని మంత్రి సీతక్క వెల్లడి
- మహిళా ఉన్నతే తెలంగాణ ప్రగతి అని వ్యాఖ్య

**హైదరాబాద్, మే 07 (తెలంగాణ ముచ్చట్లు):** మహిళా స్వయం సహాయక సంఘాలకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త తెలిపింది. మహిళా సంఘాలకు అందిస్తున్న వడ్డీలేని రుణాల పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతున్నట్లు మంత్రి సీతక్క ప్రకటించారు. స్వయం సహాయక బృందాలు తీసుకునే రూ.10 లక్షల రుణంపై వడ్డీ మొత్తాన్ని ప్రభుత్వమే భరిస్తుందని వెల్లడించారు. ప్రజాభవన్‌లో గురువారం మహిళా స్వయం సహాయక బృందాలకు సంబంధించిన బ్యాంకు వార్షిక రుణ ప్రణాళికను మంత్రి సీతక్క ఆవిష్కరించారు.

మిగతా 2లో..






# ఉమ్మడి నల్లగొండ జిల్లాపై మంత్రుల సమీక్ష సమావేశం

**ఇందిరమ్మ ఇండ్లు, రెవెన్యూ అంశాలపై అధికారులకు ఆదేశాలు**

**నల్లగొండలో కొత్త రిజిస్ట్రేషన్ కార్యాలయం ఏర్పాటు**

**హౌసింగ్ కాలనీ, 2బిహెచ్‌కే పనులపై కీలక నిర్ణయాలు**

**హైదరాబాద్, మే 07 (తెలంగాణ ముచ్చట్లు):** హైదరాబాద్‌లోని హౌసింగ్ కార్పొరేషన్ భవనంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇందిరమ్మ ఇండ్లు, రెవెన్యూ అంశాలపై కీలక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, కోమటిరెడ్డి వెంకటరెడ్డితో పాటు ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. సమావేశంలో నల్లగొండ జిల్లా కేంద్రంలో త్వరలోనే కొత్త రిజిస్ట్రేషన్ కార్యాలయం ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. మహాత్మా గాంధీ యూనివర్సిటీ ఎదురుగా ఉన్న 70 ఎకరాల భూమిలో కొత్త హౌసింగ్ కాలనీ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రణాళికాబద్ధంగా కాలనీ అభివృద్ధి చేయాలని సూచించారు. నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనమైన గ్రామాల్లోని 9,640 ఇండ్ల క్రమబద్ధీకరణ,


మిగతా 2లో..

# రాష్ట్ర స్థాయి మెగా రైతు మేళాలో పాల్గొన్న మంత్రులు

**హన్మకొండలో ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమం**

**రైతులకు ఆధునిక వ్యవసాయంపై అవగాహన**

**కార్యక్రమంలో పాల్గొన్న తుమ్మల నాగేశ్వర్ రావు, కొండా సురేఖ**



**హన్మకొండ, మే 07 (తెలంగాణ ముచ్చట్లు):**

హన్మకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి మెగా రైతు మేళా ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, మంత్రి కొండా సురేఖ సహచర ఎమ్మెల్యేలతో కలిసి పాల్గొన్నారు. రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, ప్రభుత్వ పథకాలు, సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈ మేళాను నిర్వహించారు. వ్యవసాయ రంగంలో కొత్త విధానాలు, అధిక దిగుబడులు సాధించే మార్గాలపై అధికారులు రైతులకు వివరించారు.

ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. రైతులు ఆధునిక సాంకేతికతను వినియోగించుకుని లాభదాయక వ్యవసాయం వైపు అడుగులు వేయాలని సూచించారు. మేళాలో ఏర్పాటు చేసిన వివిధ శాఖల స్టాళ్లను మంత్రులు సందర్శించి వివరాలు తెలుసుకున్నారు.

మిగతా 2లో..



# ఫార్మా సిటీ రైతుల పక్షాన పోరాడుతాం

**బషీర్‌బాగ్ అఖిలపక్ష సమావేశంలో కల్వకుంట్ల కవిత హెచ్చరిక**

**భూసేకరణ వెంటనే నిలిపివేయాలని డిమాండ్**

**రైతులకు న్యాయం జరిగే వరకు ఉద్యమం కొనసాగిస్తామని స్పష్టం**

**హైదరాబాద్, మే-07 (తెలంగాణ ముచ్చట్లు):**

ఫార్మా సిటీ కోసం సేకరించిన భూములను వెంటనే రైతులకు తిరిగి ఇవ్వాలని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఫార్మా సిటీ రైతులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో “ఫార్మా సిటీలో ఏం జరుగుతోంది” అంశంపై నిర్వహించిన అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె పాల్గొని రైతులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ ఫార్మా సిటీ

మిగతా 2లో..

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలం

(మొదటి పేజీ తరువాయి)

నెల రోజులుగా ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా జరగడం లేదని ఆరోపించారు. తరుగు పేరుతో రైతులను దోచుకుంటున్నారని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని విమర్శించారు. ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా జరుగుతున్నాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెబుతున్నారని, కానీ వాస్తవ పరిస్థితులు పూర్తిగా భిన్నంగా ఉన్నాయని హరీశ్ రావు అన్నారు. తాను ఏసీ గదుల్లో కూర్చొని మాట్లాడడం లేదని, రైతుల మధ్య నిలబడి వారి గోడును వింటున్నానని వ్యాఖ్యానించారు.



తేమ పరీక్షకు పదిరోజులు, గోనె సంచుల కోసం మరో వారం, తూకం వేయడానికి మరో వారం పడుతోందని ఆరోపించారు. మిల్లులకు వెళ్లిన తర్వాత కూడా లారీల వద్ద బస్తాలకు కటింగ్ పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షాలతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని హరీశ్ రావు పేర్కొన్నారు. చౌటుప్పల్ మార్కెట్‌లో వర్షం పడితే వడ్ల కుప్పలు నీట మునిగే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని డిమాండ్ చేశారు. రైతుబంధు, యూరియా, రుణమాఫీ, ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు.

# మహిళా సంఘాలకు వడ్డీలేని రుణ పరిమితి పెంపు

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళల ఆర్థిక సాధికారత కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. 202526 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి స్వయం సహాయక బృందాల సభ్యులకు రూ.25,228.89 కోట్ల బ్యాంకు రుణాలు అందిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. మహిళా సంఘాల రుణాలపై వడ్డీ భారం తగ్గించేందుకు ప్రభుత్వం రూ.2,500కోట్లు వ్యయం చేయనున్నట్లు తెలిపారు. "మహిళా ఉన్నతి - తెలంగాణ ప్రగతి" అనే నినాదంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని సీతక్క పేర్కొన్నారు. మహిళలు పేదరికం నుంచి బయటపడినప్పుడే సమాజ అభివృద్ధి పూర్తిస్థాయిలో సాధ్యమవుతుందని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలోని కోటిమంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి తెలిపారు. మహిళలు స్వయం ఉపాధి, చిన్న పరిశ్రమలు, వ్యాపార రంగాల్లో ముందుకు రావాలని ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాల ప్రతినిధులు, బ్యాంకు అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. మహిళల ఆర్థిక పురోగతికి ప్రభుత్వం మరిన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తుందని అధికారులు వెల్లడించారు.

# తెలుగు రాష్ట్రాలకు వర్ష సూచన

- మూడు రోజుల పాటు వానలు కురిసే అవకాశం
- ద్రోణి ప్రభావంతో తగ్గనున్న ఉష్ణోగ్రతలు
- ఉరుములు, ఈదురుగాలులపై వాతావరణ శాఖ హెచ్చరిక



**హైదరాబాద్, మే 07 (తెలంగాణ ముచ్చట్లు):** తెలుగు రాష్ట్రాల్లో మండుతున్న ఎండలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు వాతావరణ శాఖ ఊరటనిచ్చే సమాచారం వెల్లడించింది. కర్ణాటక నుంచి రాయలసీమ, తెలంగాణ మీదుగా ఏర్పడిన ద్రోణి ప్రభావంతో రానున్న మూడు రోజుల పాటు తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈ వాతావరణ మార్పుల ప్రభావంతో గత కొన్ని రోజులుగా నమోదవుతున్న అధిక ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గే అవకాశముందని అధికారులు పేర్కొన్నారు. వాతావరణం చల్లబడడంతో ప్రజలకు కొంత ఉపశమనం లభించే అవకాశం ఉందని తెలిపారు. తెలంగాణలో జోగులాంబ గద్వాల, ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్లగొండ, మెదక్, ఖమ్మం, నిజామాబాద్ జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఎక్కువగా ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో పాటు బలమైన ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ఉరుములు సంభవించే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. చెట్ల కింద నిలబడకుండా, అవసరం లేకుండా బయట తిరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అంచనా వేసింది. తీర ప్రాంతాల్లో ఉరుములతో కూడిన జల్లులు పడవచ్చని తెలిపింది. అకాల వర్షాల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. కోతకు వచ్చిన పంటలను భద్రపరుచుకోవాలని, ధాన్యం తడవకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ సూచించింది.

# ధాన్యం కొనుగోళ్లలో జాప్యంతో రైతుల ఆందోళనలు

- రోడ్లపైకి వచ్చిన అన్నదాతలు
- తూకాలు, తరుగు పేరుతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు
- కొనుగోళ్లు వేగవంతం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి



**హైదరాబాద్, మే 07 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర జాప్యం చోటుచేసుకోవడంతో రైతులు రోడ్లపైకి వచ్చి నిరసనలు చేపడుతున్నారు. పండించిన పంటను సకాలంలో కొనుగోలు చేయకపోవడంతో అన్నదాతలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అకాల వర్షాల భయంతో వడ్ల కుప్పలను కాపాడుకుంటూ రైతులు అధికారుల చుట్టూ తిరుగుతున్న పరిస్థితి నెలకొంది.

మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం గుడిపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో పది రోజులుగా తూకం వేయకపోవడంతో రైతులు జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన చేపట్టారు. స్థానిక తహసీల్దార్ పుష్పలత అక్కడికి చేరుకుని రైతుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు అధికారుల కాళ్లపై పడుతూ తమ ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని వేడుకున్నారు. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం వెంకటాయపల్లిలో కూడా రైతులు జాతీయ రహదారిపై ఆందోళన నిర్వహించారు. ఇరవై రోజులుగా ధాన్యం కొనుగోలు చేయడం లేదని, ఇప్పటికే పంపిన ధాన్యంలో కూడా కోతలు విధిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. లారీలు సమయానికి రాకపోవడం వల్ల మరింత ఆలస్యం జరుగుతోందని వాపోయారు.

వరంగల్ జిల్లా వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ వద్ద రైతులు జాతీయ రహదారిపై ధర్నాకు దిగారు. కాంటాలు వేయకుండా మార్కెట్ ఛైర్మన్ అడ్డుకుంటున్నారని ఆరోపించారు. పోలీసుల జోక్యంతో ఆందోళన తాత్కాలికంగా విరమించినా, సమస్య పరిష్కారం కావాలని రైతులు డిమాండ్ చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా తుక్కాపురం చౌరస్తాలో రైతులు ధాన్యం బస్తాలతో నిరసన తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో క్వింటాకు ఐదు కిలోల వరకు తరుగు తీస్తున్నారని

# హత్య చేసేందుకు కుట్ర చేశారు: కౌశిక్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

తనపై జరిగిన దాడి వెనుక రాజకీయ కుట్ర ఉందని కౌశిక్ రెడ్డి ఆరోపించారు. ముందుగానే తనపై రెక్కీ నిర్వహించారని, ప్రాణహాని ఉందని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని మండిపడ్డారు.

బీజేపీ కార్యకర్తలు కర్రలు, కత్తులు, పెట్రో బాంబులతో దాడికి పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. ఒక ఎమ్మెల్యేకే రక్షణ లేని పరిస్థితి ఉంటే సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. కరీంనగర్‌లో గన్ కల్చర్‌ను ప్రోత్సహించడం ప్రమాదకరమని కౌశిక్ రెడ్డి పేర్కొన్నారు. దొంగతనాలను ప్రశ్నించినందుకే తనను లక్ష్యంగా చేసుకున్నారని ఆరోపించారు.

కేటీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని చెప్పడమే తాను చేసిన తప్పా అని ప్రశ్నించారు. తాను రెచ్చగొట్టేలా వ్యవహరించానని ఎవరైనా నిరూపిస్తే ముక్కు నేలకు రాస్తానని సవాల్ విసిరారు. ఈ ఘటనతో కరీంనగర్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. భారీగా పోలీసులు మోహరించి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. ఘటనపై పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

# ఉమ్మడి నల్లగొండ జిల్లాపై మంత్రుల సమీక్ష సమావేశం

(మొదటి పేజీ తరువాయి)

నంబరింగ్ సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. నల్లగొండ కలెక్టరేట్ సమీపంలోని 2బిహెచ్‌కే కాలనీలో పెండింగ్‌లో ఉన్న పనుల పూర్తి కోసం రూ.1 కోటి నిధులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. పనులను త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. అదనంగా నల్లగొండలో ఎంఆర్ఓ అర్బన్, ఎంఆర్ఓ రూరల్ కార్యాలయాల ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారు. దేవరకొండ, ఆలేరు వంటి ఎస్టీ జనాభా అధికంగా ఉన్న నియోజకవర్గాల్లో అదనపు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయనున్నట్లు సమావేశంలో వెల్లడించారు.

# రాష్ట్ర స్థాయి మెగా రైతు మేళాలో పాల్గొన్న మంత్రులు

(మొదటి పేజీ తరువాయి)

వ్యవసాయ యంత్రాలు, విత్తనాలు, ఎరువులు, సాగు పద్ధతులకు సంబంధించిన ప్రదర్శనలు రైతులను ఆకట్టుకున్నాయి.

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అన్ని విధాలుగా అండగా నిలుస్తోందని నాయకులు పేర్కొన్నారు. పంట ఉత్పత్తి పెంపు, మార్కెటింగ్ సదుపాయాల విస్తరణ, సాగునీటి సౌకర్యాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, అధికారులు, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రైతు మేళా ద్వారా వ్యవసాయ రంగంలో కొత్త అవకాశాలపై అవగాహన పెరుగుతుందని అధికారులు అభిప్రాయపడ్డారు.

# ఫార్మా సిటీ రైతుల పక్షాన పోరాడుతాం

(మొదటి పేజీ తరువాయి)

భూ సేకరణ కోసం తీసుకొచ్చిన జీవో 31ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల అంగీకారం లేకుండానే భూములు సేకరించారని ఆరోపించారు. ఫార్మా సిటీ, ఫ్యూచర్ సిటీ పేర్లతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తే ఎట్టి పరిస్థితుల్లో ఊరుకోబోమని హెచ్చరించారు. గత ప్రభుత్వం ఫార్మా సిటీ విషయంలో అసత్యాలు చెప్పిందని, ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే విధానాన్ని కొనసాగిస్తోందని విమర్శించారు. కోర్టులో ఒక విధంగా, ప్రజల ముందు మరో విధంగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. రైతుల సమస్యల పరిష్కారంలో తెలంగాణ రక్షణ సేన ముందుండి పోరాడుతుందని స్పష్టం చేశారు. ఫ్యూచర్ సిటీ పేరుతో ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని కవిత మండిపడ్డారు. బుల్లెట్ ట్రైన్, డేటా సెంటర్లు, భారీ పెట్టుబడుల పేరుతో ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. డేటా సెంటర్ల వల్ల కాలుష్యం, శబ్ద కాలుష్యం పెరిగే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఎకరాకు ఇచ్చే పరిహారం రైతుల భవిష్యత్తుకు సరిపోదని కవిత అన్నారు. రైతుల జీవనోపాధిని దెబ్బతీసే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. హైదరాబాద్ అభివృద్ధి పేరుతో గ్రామీణ ప్రాంతాలను నష్టపరిచే ప్రయత్నాలు ఆపాలని డిమాండ్ చేశారు. రైతుల పంట కొనుగోళ్ల విషయంలో కూడా ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదని కవిత ఆరోపించారు. భవిష్యత్తులో పంట కొనుగోళ్లు ఎత్తివేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. రైతులకు న్యాయం జరిగే వరకు ఉద్యమం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

# పోగొట్టుకున్న 127 మొబైళ్లను అప్పగించిన సిద్దిపేట పోలీసులు

- రూ.12 లక్షల విలువైన ఫోన్ల స్వాధీనం
- సీఈఐఆర్‌లో వెంటనే ఫిర్యాదు చేయాలని సీపీ సూచన
- ఈ ఏడాది జిల్లాలో ఇప్పటివరకు 344 ఫోన్ల రికవరీ

**సిద్దిపేట, మే-07 (తెలంగాణ ముచ్చట్లు):** పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను గుర్తించి బాధితులకు తిరిగి అందించే కార్యక్రమంలో సిద్దిపేట పోలీసులు మరోసారి విజయవంతమయ్యారు. జిల్లాలో పోయిన 127 మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకుని బాధితులకు గురువారం అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్వాధీనం చేసుకున్న మొబైల్ ఫోన్ల విలువ సుమారు రూ.12 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. ప్రత్యేక సాంకేతిక పరిజ్ఞానం సాయంతో ఈ మొబైళ్లను గుర్తించి తిరిగి రికవరీ చేసినట్లు వెల్లడించారు.

ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు తమ మొబైల్ ఫోన్లు పోయిన వెంటనే సీఈఐఆర్ వేదికలో ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. ఇలా చేయడం ద్వారా ఫోన్లను త్వరగా గుర్తించే అవకాశం ఉంటుందని తెలిపారు. వ్యక్తిగత సమాచార భద్రత విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీపీ సూచించారు. మొబైల్ ఫోన్లలో వ్యక్తిగత వివరాలు, బ్యాంకింగ్ సమాచారం ఉండే కారణంగా వెంటనే ఫిర్యాదు చేయడం ఎంతో అవసరమన్నారు. ఈ ఏడాది జిల్లాలో ఇప్పటివరకు మొత్తం 344 మొబైల్ ఫోన్లను పోలీసులు రికవరీ చేసినట్లు అధికారులు వెల్లడించారు. ప్రజలకు సేవలందించడంలో సాంకేతికతను సమర్థంగా వినియోగిస్తున్నామని పేర్కొన్నారు. బాధితులు తమ మొబైళ్లు తిరిగి పొందడంతో ఆనందం వ్యక్తం చేస్తూ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఆస్తుల రక్షణకు పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని అధికారులు పేర్కొన్నారు.



# "ప్రజాస్వామ్యాన్ని దాడులతో అణిచేయలేరు"



కాంగ్రెస్ నేత ఆర్ఎస్ గౌడ్ ఫైర్

**జమ్మికుంట టౌన్ మే 07 (తెలంగాణ ముచ్చట్లు):** "ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ మాట్లాడే హక్కు ఉంది. రాజకీయ విమర్శలకు ప్రతివిమర్శలతో సమాధానం ఇవ్వాలి గానీ... కార్యాలయాలపై దాడులు చేయడం, కార్లు ధ్వంసం చేయడం రౌడీయిజానికి నిదర్శనం" అంటూ కాంగ్రెస్ నాయకుడు ఆర్ఎస్ గౌడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కరీంనగర్‌లో ఇటీవల చోటుచేసుకుంటున్న రాజకీయ ఉద్రిక్తతలు, దాడుల ఘటనలపై స్పందించిన ఆయన... ప్రజాస్వామ్య వ్యవస్థలో భయభ్రాంతులకు తావులేకుండా ప్రతి ఒక్కరికీ అభిప్రాయం వ్యక్తం చేసే స్వేచ్ఛ ఉండాలని అన్నారు. రాజకీయ కక్షలతో హింసాత్మక ఘటనలకు పాల్పడడం సమాజానికి ప్రమాదకరమని పేర్కొన్నారు. శాంతిభద్రతలను భంగం కలిగించేలా వ్యవహరించే వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజకీయ పార్టీల మధ్య విభేదాలు సహజమే కానీ, వాటిని హింసాత్మక దాడుల రూపంలో ప్రదర్శించడం ప్రజాస్వామ్యానికి మచ్చ తెచ్చే చర్యలని విమర్శించారు.

ప్రజల సమస్యలపై చర్చలు జరగాల్సిన సమయంలో దాడులు, బెదిరింపులు చోటుచేసుకోవడం దురదృష్టకరమని ఆర్ఎస్ గౌడ్ అన్నారు.

# ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ నిందుతుడిని అదుపులోకి తీసుకొన్న కొణిజర్ల పోలీసులు

- వైరా ఏసీపీ సారంగపాణి

**ఖమ్మం బ్యూరో, మే 7(తెలంగాణ ముచ్చట్లు ):** కొణిజర్ల మండల పరిధిలోని తనికెళ్ల గ్రామంలో అక్రమంగా ఐపీఎల్ 2026 క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న నిందుతుడిని కొణిజర్ల పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు వైరా ఏసీపీ సారంగపాణి తెలిపారు. తనికెళ్ల గ్రామంలోని అమ్మ టిఫిన్ సెంటర్ వద్ద ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ జరుగుతోందని అందిన విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్సై సూరజ్ తన సిబ్బందితో కలిసి దాడి నిర్వహించారన్నారు. ప్రధాన నిర్వాహకుడు గుగులోత్ వెంకటేష్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. నిందుతుడు వద్ద నుండి రూ.3,000 నగదు, బెట్టింగ్‌కు సంబంధించిన 8 రాతపత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మిగతా నిందితులు అక్కడి నుంచి పరారయ్యారన్నారు.

దర్యాప్తులో నిందితులు మొబైల్ ఫోన్ కాల్స్ ద్వారా ఆఫ్‌లైన్ విధానంలో ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు వెల్లడైందన్నారు. బెట్టింగ్‌లో పాల్గొన్న వారి నుండి డబ్బులు సేకరించి, మ్యాచ్‌లు పూర్తైన తర్వాత కమిషన్ తీసుకుని మిగతా మొత్తాన్ని విజేతలకు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. ఈ మేరకు కొణిజర్ల పోలీస్ స్టేషన్‌లో క్రైం నంబర్ 103/2026 కింద తెలంగాణ గేమింగ్ యాక్ట్ సెక్షన్ 3 ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

ఇటువంటి అక్రమ బెట్టింగ్ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, ఎవరైనా బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.



# ఖమ్మంకు క్రికెట్ కళకు రఘురాం కసరత్తు

- స్టేడియం వేటలో ఎంపీ రామసహాయం
- రఘునాథపాలెం మండలం జింకల తండా, ఖమ్మం రూరల్ తల్లంపాడు వద్ద స్వయంగా గుట్టల పైకి ఎక్కి స్థలాల పరిశీలన

**ఖమ్మం బ్యూరో, మే 7(తెలంగాణ ముచ్చట్లు ):** నగర సమీపంలో క్రికెట్ స్టేడియం నిర్మాణానికి కావాల్సిన సాధ్యాసాధ్యాలపై ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లా క్రికెట్ అసోసియేషన్ కోరిక మేరకు.. గురువారం ఆయన రఘునాథపాలెం మండలం జింకల తండా సమీపంలో గుట్టల ప్రాంతం, ఖమ్మం రూరల్ మండలం తల్లంపాడు వద్ద హైవే వెంట ఉన్న కొండల ప్రాంతాల్లో సుడిగాలి పర్యటన చేశారు. స్టేడియం నిర్మాణానికి అనువైన స్థలం కోసం అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు.

శ్రమకోర్చి.. గుట్టపైకి

స్టేడియం నిర్మాణానికి విశాలమైన, అనువైన భూమిని గుర్తించే క్రమంలో ఎంపీ రఘురాం రెడ్డి శ్రమను లెక్కచేయకుండా రాళ్లు, రప్పలతో నిండిన గుట్టపైకి కాలినడకన ఎక్కారు. ఎగుడు దిగుడు మార్గాల గుండా ప్రయాణించి, గుట్టపై నుంచి చుట్టుపక్కల ప్రాంతాలను నిశితంగా పరిశీలించారు. ఖమ్మం క్రీడాకారుల కలల ప్రాజెక్టు అయిన క్రికెట్ స్టేడియం నిర్మాణానికి పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు ఎంపీ తెలిపారు.

ఈ పర్యటనలో...:జాయింట్ కలెక్టర్ శ్రీనివాస రెడ్డి, డీవైఎస్ఓ సునీల్ రెడ్డి, రఘునాథపాలెం ఎమ్మార్వో ఎస్.శ్వేత, ఖమ్మం రూరల్ ఎమ్మార్వో విజయేందర్ రెడ్డి, సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.






# రైతులకు కల్టివేటర్లు, డ్రోన్ల పంపిణీ

- సేంద్రీయ సాగుతోనే భూమి సారం కాపాడగలం.
- ఎమ్మెల్యే రాగమయి.

**సత్తుపల్లి, మే 7(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ప్రభుత్వం సహకార, వ్యవసాయ, విద్యుత్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక"లో భాగంగా రైతు వారోత్సవం సందర్భంగా తల్లాడ మండలం గంగాదేవిపాడు గ్రామంలోని పీఏసీఎస్ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో నిర్వహించిన వ్యవసాయ యాంత్రీకరణ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రసాయన ఎరువుల అధిక వినియోగం వల్ల భూమి సారం తగ్గిపోవడంతో పాటు పంట దిగుబడులపై ప్రతికూల ప్రభావం పడుతోందన్నారు. వరి కొయ్యలను కాల్చడం వల్ల పర్యావరణ కాలుష్యం పెరిగి ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ ఆధునిక సాంకేతికతతో కూడిన సేంద్రీయ వ్యవసాయ పద్ధతులను అనుసరించాలని కోరారు. రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్న ఆమె, రైతులకు కల్టివేటర్లు, డ్రోన్లు అందుబాటులోకి తీసుకువచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే రైతులకు కల్టివేటర్లు, డ్రోన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్, వ్యవసాయ శాఖల అధికారులు, తల్లాడ మండల సర్పంచులు, సొసైటీ డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



# రైతులను మోసం చేసిన బీఆర్ఎస్‌కు మాట్లాడే హక్కు లేదు

- కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు వేముల శ్రీనివాసరెడ్డి

**వనపర్తి,మే7(తెలంగాణ ముచ్చట్లు):** గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రైతులను పూర్తిగా నిర్లక్ష్యం చేసి, ఇప్పుడు రాజకీయ ప్రయోజనాల కోసం రైతుల పేరుతో సభలు నిర్వహించడం దురదృష్టకరమని కిసాన్ కాంగ్రెస్ వనపర్తి జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి విమర్శించారు.గురువారం వనపర్తి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.బీఆర్ఎస్ పాలనలో వేలాది మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నప్పటికీ, ఒక్క రైతు కుటుంబాన్ని కూడా పరామర్శించలేదని ఆరోపించారు. ఖమ్మం మిర్చి రైతులకు బేడీలు వేయడం, ప్రాజెక్టు ముంపు బాధితులపై లాఠీచార్జీలు చేయించడం, ధరణి పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేయడం బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలేనన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని, 28 నెలల్లో రూ.1.52 లక్షల కోట్లు రైతుల కోసం ఖర్చు చేసిందని తెలిపారు. రూ.2 లక్షల వరకు రైతు రుణమాఫీ, రైతు భరోసా, సన్న వరిధాన్యానికి బోనస్, పంట నష్టపరిహారం వంటి పథకాలతో రైతులకు అండగా నిలుస్తోందన్నారు.రైతులను మోసం చేసిన బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం తగదని, కేటీఆర్ అహంకారం విడిచిపెట్టి రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో కిసాన్ సెల్ నాయకులు సుదర్శన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు జానకి రాములు తదితరులు పాల్గొన్నారు.



# ఆటో కార్మికుడి మృతితో విషాదం కుటుంబానికి ఆర్థిక సహాయం

**ఎల్కతుర్తి, మే 07( తెలంగాణ ముచ్చట్లు):** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం దండేపల్లి గ్రామానికి చెందిన ఆటో కార్మికుడు మాచర్ల అశోక్ అనారోగ్యంతో కిడ్నీ ఫెయిల్ కావడంతో మృతి చెందాడు. ఈ ఘటన గ్రామంలో విషాదాన్ని నింపింది. మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన హుజురాబాద్ డివిజన్ స్వశక్తి ఆటో యూనియన్ సభ్యులు కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి తమ మానవత్వాన్ని చాటుకున్నారు.

ఈ సందర్భంగా హుజురాబాద్ డివిజన్ ఆటో యూనియన్ అధ్యక్షులు శనిగరపు రాజేందర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అమలు చేస్తున్న ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని స్వాగతిస్తున్నప్పటికీ, ఆటో డ్రైవర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కిరాయిలు లేక కుటుంబ పోషణ, పిల్లల చదువులు, వైద్య ఖర్చులు భరించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఆటో డ్రైవర్లకు ఆరోగ్య సమస్యలు వచ్చినా ఆసుపత్రికి వెళ్లలేని పరిస్థితి నెలకొన్నదని, పలువురు ఆటో కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.10 వేల కోట్లతో ప్రత్యేక సంక్షేమ నిధిని ఏర్పాటు చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

మృతుడు మాచర్ల అశోక్‌కు భార్య స్వందనతో పాటు ఇద్దరు కుమారులు విశ్వేశ్ (12), వరుణ్ తేజ్ (10) ఉన్నారు. ఈ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని యూనియన్ నాయకులు విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో దండేపల్లి ఆటో యూనియన్ అధ్యక్షుడు మాచర్ల శంకర్, ఉపాధ్యక్షుడు పొంగ ప్రవీణ్, కార్యదర్శి చిర్ర కుమారస్వామి, ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.



# పేదరికాన్ని జయించి 'డాక్టర్' అయిన చైతన్య సాయి

- డీసీఎం డ్రైవర్ కొడుకు అద్భుత విజయం
- ప్రభుత్వ పాఠశాల నుంచి మెడికల్ కాలేజ్ వరకూ...
- తల్లిదండ్రుల త్యాగానికి గర్వకారణమైన కుమారుడు

**ఖమ్మం బ్యూరో, మే 7(తెలంగాణ ముచ్చట్లు):** కష్టపడి చదివే గుణం, కన్నవారి కష్టాన్ని తీర్చాలనే తపన ఉంటే ఎంతటి లక్ష్యాన్నైనా ముద్దాడవచ్చని ఖమ్మం బిడ్డ నామవరపు చైతన్య సాయి నిరూపించారు. ఖమ్మం నగరంలోని జహీర్‌పుర, గుట్టల బజార్ ప్రాంతానికి చెందిన నామవరపు చైతన్య సాయి తన కృషి, పట్టుదల, చదువుపట్ల ఉన్న మక్కువతో డాక్టర్‌గా ఎదిగి అందరికీ ఆదర్శంగా నిలిచాడు. కాళోజీ నారాయణరావు ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం పరిధిలోని మహబూబ్‌నగర్ గవర్నమెంట్ మెడికల్ కాలేజీలో అతి సాధారణ కుటుంబం నుంచి వచ్చిన ఈ యువకుడు బుధవారం సాయంత్రం డాక్టరేట్ పట్టా అందుకొని తన తల్లిదండ్రుల కలలను నిజం చేశాడు.

తల్లి నామవరపు రేణుక గృహిణిగా, తండ్రి నామవరపు కోటయ్య డీసీఎం డ్రైవర్‌గా ఎన్నో కష్టాలు పడుతూ కుమారుడిని చిన్ననాటి నుంచే ప్రభుత్వ పాఠశాలలో చదివించారు. ఆర్థిక ఇబ్బందులు అడుగడుగునా ఎదురైనా, "చదువే భవిష్యత్తు" అనే నమ్మకంతో కుమారుడి విద్య కోసం తల్లిదండ్రులు చేసిన త్యాగం చివరకు ఫలించింది.

చిన్నప్పటి నుంచే చదువులో మెరిట్ విద్యార్థిగా గుర్తింపు తెచ్చుకున్న చైతన్య సాయి, క్రమశిక్షణతో చదువుకుంటూ ప్రతి తరగతిలోనూ ప్రత్యేక ప్రతిభ కనబరిచేవాడు. పెద్దల పట్ల గౌరవం, లక్ష్యంపై అచంచల నమ్మకం, కష్టపడే స్వభావం అతడిని ఈ స్థాయికి తీసుకువచ్చాయి. దళిత కుటుంబానికి చెందిన చైతన్య సాయి ఎంతో పోరాటం చేసి మెడికల్ సీట్ సాధించాడు. అనంతరం కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ పరిధిలోని మహబూబ్‌నగర్ గవర్నమెంట్ మెడికల్ కాలేజీలో మెడిసిన్ విద్యను పూర్తిచేసి డాక్టర్‌గా పట్టా పొందాడు. డాక్టరేట్ పట్టా అందుకున్న క్షణంలో తల్లిదండ్రుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఎన్నో కష్టాలను భరించి చదివించిన తమ కుమారుడు డాక్టర్‌గా ఎదగడం చూసి కుటుంబ సభ్యులు భావోద్వేగానికి గురయ్యారు. గుట్టల బజార్ ప్రాంతంలోనూ ఆనందోత్సవాలు వెల్లివిరిశాయి. స్థానికులు, బంధువులు, స్నేహితులు చైతన్య సాయికి శుభాకాంక్షలు తెలుపుతూ అతని విజయాన్ని గర్వంగా కొనియాడారు.

"పేదరికం చదువుకు అడ్డంకి కాదు... పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదు" అని చైతన్య సాయి విజయం మరోసారి నిరూపించింది. కష్టపడి చదివితే సమాజంలో గౌరవం, గుర్తింపు ఎలా వస్తాయో ఈ యువ డాక్టర్ జీవితం నేటి యువతకు స్ఫూర్తిగా నిలుస్తోంది. ఈ కార్యక్రమంలో నామవరపు సైదమ్మ, కొత్తపల్లి వీరమణి, కుక్కల వసంత, కొత్తపల్లి ప్రసాద్, కొత్తపల్లి మేఘన, కొత్తపల్లి సంధ్య, హనీ తదితరులు పాల్గొని చైతన్య సాయిని అభినందించారు.

# పెద్దమందడిలో నేడు పశు ఆరోగ్య శిబిరం

- పెద్దమందడి మండల పశువైద్యాధికారి శ్యాంసుందర్ నాయక్



**పెద్దమందడి,మే7(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలంలోని పెద్దమందడి ప్రాథమిక పశువైద్యశాలలో నేడు ఉదయం 8 గంటలకు పశు ఆరోగ్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మండల పశువైద్యాధికారి శ్యాంసుందర్ నాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజా ప్రభుత్వం ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.ఈ శిబిరంలో పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్సలు, చూడి పరీక్షలు నిర్వహించడంతో పాటు మేలు జాతి దూడల ప్రదర్శన చేపట్టనున్నట్లు తెలిపారు.అలాగే దూడలకు నట్టల నివారణ మందులు త్రపించడం, పశుగ్రాస విత్తనాల పంపిణీ చేయడం జరుగుతుందని చెప్పారు.వేసవి కాలంలో పశు సంరక్షణ చర్యలు, పశుగ్రాసం పెంపకంపై రైతులకు ప్రత్యేక అవగాహన కల్పించనున్నట్లు శ్యాంసుందర్ వెల్లడించారు.గ్రామ రైతులు, ప్రజాప్రతినిధులు, పత్రిక విలేకరులు ఈ కార్యక్రమానికి సకాలంలో హాజరై సద్వినియోగం చేసుకుని విజయవంతం చేయాలని కోరారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## ఖబర్దార్ కౌశిక్ రెడ్డి.. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ముట్టడించిన బీజేపీ నేతలు

**హుజూరాబాద్, మే 7(తెలంగాణ ముచ్చట్లు ):** కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ పై హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ గురువారం హుజూరాబాద్ నియోజకవర్గ బీజేపీ నాయకులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు కలిసి హుజూరాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముందు పాడి కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. "ఖబర్దార్ కౌశిక్ రెడ్డి" అంటూ నినాదాలు చేస్తూ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడించారు.

బీజేపీ నేతలు మాట్లాడుతూ కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్‌పై వ్యక్తిగత విమర్శలు చేయడం తగదని, ఇలాంటి వ్యాఖ్యలను ప్రజలు సహించరని హెచ్చరించారు. భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతం కాకూడదని డిమాండ్ చేశారు.

ఈ నిరసన కార్యక్రమంలో హుజూరాబాద్ నియోజకవర్గానికి చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## 1 కోతుల బెడదకు చెక్.. హుజూరాబాద్ ప్రజలకు ఊరట

**హుజురాబాద్ మే 7(తెలంగాణ ముచ్చట్లు ):** హుజూరాబాద్ ప్రజలను ఏళ్ల తరబడి బెంబేలెత్తిస్తున్న కోతుల బెడదకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. మున్సిపల్ పాలకవర్గం నిర్ణయం మేరకు గురువారం కోతుల తరలింపు కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని ప్రారంభించారు.

202627 బడ్జెట్‌లో ఇందుకోసం రూ.4 లక్షలు కేటాయించిన మున్సిపాలిటీ, పట్టణంలోని 30 వార్డుల్లో కోతులను పట్టించే చర్యలు చేపట్టింది. దీర్ఘకాలంగా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న సమస్యపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి చర్యలు ప్రారంభించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కోతులు ఇళ్లపైకి ఎక్కడం, ఆహార పదార్థాలు ఎత్తుకెళ్లడం, చిన్నారులు మరియు వృద్ధులను భయభ్రాంతులకు గురిచేయడం వంటి ఘటనలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాజాగా మున్సిపాలిటీ తీసుకున్న నిర్ణయంతో పట్టణ ప్రజలకు కొంత ఉపశమనం లభించినట్లైంది.

## ఎదురుగా వచ్చిన ఎడ్లబండి... ప్రాణం తీసిన ప్రమాదం



**జమ్మికుంట టౌన్ మే 07 (తెలంగాణ ముచ్చట్లు):** కరీంనగర్ జిల్లా బల్భాపూర్ - జగ్గయ్యపల్లి మార్గమధ్యలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఎడ్లబండిని బైక్ ఎదురుగా ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది.

ఈ ఘటనలో జమ్మికుంటకు చెందిన మైస సురేందర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తి మారపల్లి దేవేందర్ తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అభి అనే యువకుడు గాయాలతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డట్లు తెలుస్తోంది.


సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదానికి గల పూర్తి కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది.

ఈ ఘటనతో స్థానికంగా విషాద ఛాయలు అలుముకున్నాయి.



# గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

- నిధుల్లో అత్యధిక భాగం మారుమూల ప్రాంతాలకే కేటాయిస్తా
- మధిర, బోనకల్ మండలాల్లో ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి విస్తృత పర్యటన
- రూ.52లక్షల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు



**ఖమ్మం బ్యూరో, మే 7(తెలంగాణ ముచ్చట్లు ):** గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి అన్నారు. గురువారం ఆయన మధిర, బోనకల్ మండలంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో రూ.52లక్షల వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్ల పనులకు శంకుస్థాపనలు చేయడంతో పాటు, పూర్తయిన పనులను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనకు కేటాయించే నిధుల్లో అత్యధిక భాగాన్ని గ్రామాలు, మారుమూల ప్రాంతాలు, ఎస్సీ, ఎస్టీ కాలనీల అభివృద్ధికి కేటాయిస్తానని ప్రకటించారు. వెనుకబడిన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడమే కాంగ్రెస్ ప్రథమ ప్రాధాన్యతని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి, అన్ని ప్రాంతాల సమాన అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తోందని, తాను ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

పర్యటన ఇలా..

బోనకల్ మండలంలోని తూటికుంట్ల గ్రామంలో రూ.5 లక్షలతో రెండు సిసి రోడ్లకు, చిరునోములలో రూ.4.50 లక్షలు, పెద్ద బీరవల్లిలో 4 లక్షలు, చిన్నబీరవల్లిలో 4.50 లక్షలు మరియు రాపల్లిలో రూ.4 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించే సిసి రోడ్లకు శంకుస్థాపన చేశారు. అదే విధంగా ముష్టికుంటలో రూ.5 లక్షలు, బోనకల్ మండల కేంద్రంలో రూ.5 లక్షలతో పూర్తయిన రోడ్లను ఆయన ప్రారంభించారు. మధిర మండలంలో... మధ్యాహ్నం అనంతరం మధిర మండలంలో పర్యటించి వంగవీడులో రూ.5 లక్షలు, నిధనపురంలో 5 లక్షల వ్యయంతో నిర్మించిన సిసి రోడ్లను ప్రారంభించగా, సిరిపురంలో రూ.5 లక్షలు మరియు రాయపట్నంలో 5 లక్షల రూపాయలతో చేపట్టనున్న కొత్త పనులకు శంకుస్థాపన చేశారు. ఒకే రోజు మొత్తం 12 ప్రాంతాల్లో సుమారు రూ. 52 లక్షల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టి పల్లెల్లో ప్రగతి పరుగులకు బాటలు వేశారు. ఈ కార్యక్రమాల్లో..:కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఐలూరి వెంకటేశ్వర రెడ్డి, డాక్టర్ కోటా రాంబాబు, మండల అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, కాంగ్రెస్ జిల్లా నాయకులు పైడిపల్లి కిషోర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బంధం శ్రీనివాసరావు, టెలిఫోన్ అడ్వైజర్ కమిటీ సభ్యులు ఉమ్మినేని కృష్ణ, సత్యనారాయణ రెడ్డి, సర్పంచులు తాళ్లూరి లక్ష్మీ నరసయ్య, పిల్లలమర్రి నాగేశ్వరరావు, అనుమోలు చంద్రకళ, బానోత్ జ్యోతి, చింతలచెరువు కోటేశ్వరావు, తాళ్లూరి వెంకట్రావమ్మ, నాయకులు సాదినేని రాంబాబు, కన్నేటి సురేష్, బోయినపల్లి మురళి, నరసయ్య శాస్త్రి, సైదా నాయక్, బండి వెంకట్రావ్, గొడుగు కృష్ణ, కొరివి సురేష్, చింతపట్ల నరేష్, భాగం నాగేశ్వరరావు, తోటకూర వెంకటేశ్వరరావు, నవోత్తమ రెడ్డి, కృష్ణ, గ్రామశాఖ అధ్యక్షులు, పలువురు ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# హైకోర్టు కేసుతో మీకేం సంబంధం

- ఆ కేసు టీడబ్ల్యూజేఎఫ్ కు సంబంధం
- టీడబ్ల్యూజేఎఫ్ తో బసవపున్నయ్య,రాంచందర్ లకు సంబంధం లేదు




**ఖమ్మం బ్యూరో,మే 07(తెలంగాణ ముచ్చట్లు ):** రాష్ట్ర, జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీలపై తాను హైకోర్టులో వేసిన కేసు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) యూనియన్ కే సంబంధం ఉందని, యూనియన్ నుంచి తనను ఎవరూ బహిష్కరించలేదనీ, టీడబ్ల్యూజేఎఫ్ వ్యవస్థాపక, రాష్ట్ర అధ్యక్షుడిగా తాను కోర్టు లో కేసు వేయడం జరిగిందని ఆ సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య స్పష్టం చేశారు. ఈ కేసుతో తమకు సంబంధం లేదంటున్న పిల్లి రాంచందర్, బసవపున్నయ్య అనే వ్యక్తులు తమ టీడబ్ల్యూజేఎఫ్ సంఘానికే సంబంధం లేరని, వారు తమ సంఘం నాయకులు కదని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ యూనియన్ కు అక్రెడిటేషన్ కమిటీ ల్లో ప్రాతినిధ్యం ఇవ్వకపోవడం వల్ల కమిటీల్లో తమ వాయిస్ లేక చాలా మంది జర్నలిస్టులకు అన్యాయం జరుగుతుందనే ఉద్దేశంతో తాను ప్రభుత్వం పై కేసు వేశానే తప్ప, జర్నలిస్టులకు అన్యాయం చేయడం కోసం కాదని అన్నారు. తమ యూనియన్ నుంచి తొలగించబడిన వ్యక్తులు స్వప్రయోజనాలు, వారి పత్రిక ప్రయోజనాలు పొందడం కోసం ప్రభుత్వంతో కుమ్మక్కై నాపై గోబెల్ ప్రచారం చేస్తున్నారని మామిడి సోమయ్య ఖండించారు. తాను ఒక జర్నలిస్టు యూనియన్ స్థాపించి గత 20 ఏళ్ళుగా జర్నలిస్టుల సమస్యలపై పోరాడుతున్న నాపై కొందరు కుట్రపన్ని యూనియన్ లో లేకుండా చేయాలనుకున్నారని, కానీ నావైపు ఉన్న మెజారిటీ జర్నలిస్టులు వాళ్ళ ఆటలు సాగనీయలేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మీడియా అక్రెడిటేషన్ల జీవో 252 ప్రకారం రాష్ట్ర, జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీలలో తమ టీడబ్ల్యూజేఎఫ్ సభ్యులకు ప్రాతినిధ్యం కల్పించాలని, లేదంటే కమిటీ నిర్ణయాలు అమలు కాకుండా చూడాలని కోరుతూ తాను హైకోర్టు ఆశ్రయించడం జరిగిందని తెలిపారు.తనను టీడబ్ల్యూజేఎఫ్ యూనియన్ నుంచి బహిష్కరించినట్లు చట్ట విరుద్ధమైన ప్రకటన చేసిన బసవపున్నయ్య, పిల్లి రాంచందర్ లపై కోర్టులో కేసు వేయడం జరిగిందని, అదేవిధంగా కార్మిక శాఖలో ఫిర్యాదు కూడా చేశామని పేర్కొన్నారు. అబద్దపు ప్రచారాలతో అసలు సమస్యను పక్కదారి పట్టిస్తున్నారని, తమ నేతృత్వంలోని టీడబ్ల్యూజేఎఫ్ కు కార్మిక శాఖ గుర్తింపు ఇచ్చిందన్న విషయం అవాస్తవమని అన్నారు.తాను కోర్టులో వేసిన కేసు పెండింగ్ లో ఉండగా కార్మిక శాఖ గుర్తింపు ఎలా ఇస్తుందని ఆయన ప్రశ్నించారు. తప్పుడు ప్రచారంతో ఇటు జర్నలిస్టులను,

అటు ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. అబద్దపు మాయ మాటలతో అటు ప్రభుత్వాన్ని, ఇటు అధికారులను మచ్చిక చేసుకొని తమ సంఘం ద్వారా లబ్ది పొందేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. టీడబ్ల్యూజేఎఫ్ పైన గానీ, సంఘం వ్యవస్థాపకుల పైన గానీ మరోసారి తప్పుడు ప్రచారం చేసినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని మామిడి సోమయ్య హెచ్చరించారు.

# పంట మార్పిడితో రైతులకు అధిక లాభాలు

- జిల్లెల చిన్నారెడ్డి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు




పెద్దమందడి,మే 7(తెలంగాణ ముచ్చట్లు): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం, రైతు వారోత్సవాల్లో భాగంగా గురువారం వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లి రైతు వేదికలో వ్యవసాయ శాఖ, విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల చిన్నారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ..రైతులు సంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా పంట మార్పిడి పద్ధతులను అనుసరిస్తే అధిక లాభాలు సాధించవచ్చని సూచించారు. ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో వ్యవసాయాన్ని అభివృద్ధి చేసుకోవాలని రైతులకు పిలుపునిచ్చారు.వ్యవసాయంలో యాంత్రీకరణ ప్రాముఖ్యత, డ్రోన్ల వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలను అధికారులు ప్రదర్శనల ద్వారా వివరించారు. అలాగే సోలార్ పంపు సెట్ల వినియోగం, ఆయిల్ ఫామ్ సాగుతో రైతులకు కలిగే ఆదాయ అవకాశాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వ్యవసాయ అధునాతన యంత్రాల స్టాల్స్, డ్రోన్ ప్రదర్శనలు రైతులను ఆకట్టుకున్నాయి.కార్యక్రమంలో వనపర్తి మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, జిల్లా వ్యవసాయ అధికారి ఆంజనేయులు, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లోకనాథ్ రెడ్డి, రైతు కమిషన్ సభ్యురాలు భవాని, గ్రామ సర్పంచ్ మంజుల, వీరాయిపల్లి గ్రామ సర్పంచ్ వెంకటేష్, వ్యవసాయ శాఖ అధికారులు, విద్యుత్ శాఖ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# గ్యాస్ ధరల పెంపుపై సీపీఎం నిరసన

**దమ్మపేట, మే 7(తెలంగాణ ముచ్చట్లు):** కేంద్ర ప్రభుత్వం పెంచిన వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరలను నిరసిస్తూ సీపీఎం దమ్మపేట మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం ముద్దులగూడెం గ్రామంలోని ఎన్టీఆర్ రింగ్ సెంటర్‌లో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సామాన్య ప్రజలపై భారాలు మోపుతోందని విమర్శించారు. గృహ వినియోగ గ్యాస్ సిలిండర్‌పై రూ.900, వాణిజ్య గ్యాస్ సిలిండర్‌పై రూ.3000 వరకు ధరలు పెంచడం అన్యాయమన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాలు అవలంబిస్తోందని ఆరోపించారు. వెంటనే పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మాజీ జిల్లా కమిటీ సభ్యులు దొడ్డా లక్ష్మీనారాయణ, గ్రామ కార్యదర్శి చెన్నుపోయిన బ్రహ్మయ్య, నరుకుల వెంకటేశ్వరరావు, కూచిపూడి రవి, ఎస్.కె. నవి, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.



# యుద్ధాలు, విపత్తుల్లో కోట్ల మందికి ప్రాణాధారం

ప్రపంచవ్యాప్తంగా మానవతా సేవలకు ప్రతీకగా నిలిచిన ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవాన్ని ప్రతి ఏడాది మే 8న ఘనంగా నిర్వహిస్తారు. యుద్ధాలు, ప్రకృతి విపత్తులు, అంటువ్యాధులు, ప్రమాదాల సమయంలో ప్రాణాపాయ స్థితిలో ఉన్న ప్రజలకు తక్షణ సహాయం అందించే సంస్థల సేవలను గుర్తు చేసుకునే రోజుగా ఈ దినోత్సవానికి ప్రత్యేక స్థానం ఉంది. మానవత్వం, దయ, సేవ అనే విలువలను ప్రపంచ ప్రజలకు గుర్తు చేయడం ఈ దినోత్సవం ప్రధాన లక్ష్యం. దేశాలు, భాషలు, మతాలు వేరైనా బాధలో ఉన్నవారికి అండగా నిలవడం అనే ఒకే భావనతో రెడ్ క్రాస్ సంస్థలు పనిచేస్తున్నాయి.

ప్రపంచ రెడ్ క్రాస్ ఉద్యమానికి పునాది వేసిన వ్యక్తి హెన్రీ డ్యునాంట్. యుద్ధ సమయంలో గాయపడిన వేలాది మంది సైనికులు సరైన వైద్యసహాయం లేక ప్రాణాలు కోల్పోతున్న దృశ్యాలను చూసి ఆయన తీవ్రంగా కలత చెందారు. గాయపడిన వారిని రక్షించేందుకు తక్షణ వైద్య సేవలు అందించే స్వచ్ఛంద సంస్థ అవసరమని భావించారు. ఈ ఆలోచనలతోనే అంతర్జాతీయ రెడ్ క్రాస్ కమిటీ స్థాపనకు మార్గం సుగమమైంది. హెన్రీ డ్యునాంట్ సేవా భావాన్ని గుర్తిస్తూ ఆయన జన్మదినమైన మే 8ను ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవంగా ప్రకటించారు.

రెడ్ క్రాస్ సంస్థలు ప్రపంచవ్యాప్తంగా అత్యవసర పరిస్థితుల్లో ముందుండి సేవలు అందిస్తున్నాయి. భూకంపాలు, వరదలు, తుఫాన్లు, అగ్నిప్రమాదాలు వంటి విపత్తులు సంభవించినప్పుడు బాధిత ప్రాంతాలకు వెంటనే చేరుకుని సహాయక చర్యలు చేపడుతున్నాయి. ఆహారం, తాగునీరు, మందులు, దుస్తులు, తాత్కాలిక ఆశ్రయాలు అందించడం ద్వారా వేలాది కుటుంబాలకు అండగా నిలుస్తున్నాయి. ప్రకృతి విపత్తుల సమయంలో ప్రభుత్వ యంత్రాంగంతో కలిసి పనిచేస్తూ ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే కార్యక్రమాల్లో కూడా రెడ్ క్రాస్ వాలంటీర్లు కీలక పాత్ర పోషిస్తున్నారు.

యుద్ధాల సమయంలో రెడ్ క్రాస్ సంస్థల సేవలు మరింత ప్రాధాన్యం సంతరించుకుంటాయి. యుద్ధాల్లో గాయపడిన సైనికులకు వైద్యసహాయం అందించడం, శరణార్థులకు ఆశ్రయం కల్పించడం, కుటుంబాల నుంచి వేరుపడిన చిన్నారులను తిరిగి కలిపించడం వంటి మానవతా కార్యక్రమాలను ఈ సంస్థలు నిర్వహిస్తున్నాయి. ప్రపంచంలోని పలు యుద్ధ ప్రభావిత దేశాల్లో రెడ్ క్రాస్ సేవలు లక్షలాది ప్రాణాలను కాపాడాయి. మానవత్వాన్ని కాపాడడమే తమ ప్రధాన ధ్యేయమని రెడ్ క్రాస్ సంస్థలు చెబుతున్నాయి.

రక్తదానం కార్యక్రమాల్లో కూడా రెడ్ క్రాస్ సంస్థలు కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందక ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు రాకుండా రక్తదాన శిబిరాలను నిర్వహిస్తున్నాయి. యువతను రక్తదానానికి ప్రోత్సహిస్తూ అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాయి. ఒక వ్యక్తి ఇచ్చే రక్తం మరొకరి ప్రాణాన్ని కాపాడగలదనే సందేశాన్ని ప్రజల్లో బలంగా తీసుకెళ్తున్నాయి. ఆసుపత్రుల్లో రక్త కొరత తగ్గించడంలో రెడ్ క్రాస్ సంస్థల పాత్ర ఎంతో కీలకమైంది.

ప్రథమ చికిత్సపై అవగాహన కల్పించడంలో కూడా రెడ్ క్రాస్ సంస్థలు విశేష కృషి చేస్తున్నాయి.




ప్రమాదాలు జరిగినప్పుడు తక్షణ చికిత్స అందితే ప్రాణాలను రక్షించవచ్చని ప్రజలకు తెలియజేస్తున్నాయి. పాఠశాలలు, కళాశాలలు, గ్రామాల్లో శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తూ అత్యవసర పరిస్థితుల్లో ఎలా స్పందించాలో ప్రజలకు నేర్పుతున్నాయి. గుండెపోటు, రోడ్డు ప్రమాదాలు, అగ్నిప్రమాదాల సమయంలో ప్రాథమిక చికిత్స అందించే విధానాలపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాయి.

కరోనా మహమ్మారి సమయంలో రెడ్ క్రాస్ సంస్థల సేవలు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందుకున్నాయి. ఆసుపత్రులకు వైద్య సామగ్రి అందించడం, ఆహార పంపిణీ చేయడం, నిరుపేద కుటుంబాలకు సహాయం అందించడం వంటి కార్యక్రమాలను నిర్వహించాయి. కరోనా బాధితులకు మానసిక ధైర్యం కల్పిస్తూ అనేక ప్రాంతాల్లో వాలంటీర్లు సేవలు అందించారు. ప్రజల్లో ఆరోగ్య అవగాహన పెంచేందుకు కూడా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. సంక్షోభ సమయంలో రెడ్ క్రాస్ సంస్థలు సమాజానికి ఎంత అవసరమో కరోనా కాలం స్పష్టంగా చూపించింది.

ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది వాలంటీర్లు రెడ్ క్రాస్ సేవల్లో భాగస్వాములవుతున్నారు. ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. వరదలు, తుఫాన్లు, ప్రమాదాల సమయంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు. యువతలో సేవా భావాన్ని పెంపొందించడంలో ఈ వాలంటీర్ల పాత్ర ఎంతో గొప్పది. సమాజంలో మానవత్వం ఇంకా జీవించి ఉందనే నమ్మకాన్ని వీరు కల్పిస్తున్నారు.

ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం సందర్భంగా పలు దేశాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. సేవా కార్యక్రమాల్లో విశేష కృషి చేసిన వాలంటీర్లను సన్మానించడం, రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడం, మానవతా విలువలపై అవగాహన సదస్సులు నిర్వహించడం జరుగుతుంది. విద్యాసంస్థలు కూడా విద్యార్థుల్లో సేవా స్ఫూర్తిని పెంపొందించేందుకు వ్యాసరచన పోటీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. సమాజంలో పరస్పర సహకారం పెరగాలనే ఉద్దేశంతో పలు స్వచ్ఛంద సంస్థలు ఈ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నాయి.

నేటి ప్రపంచంలో యుద్ధాలు, ప్రకృతి విపత్తులు, ఆరోగ్య సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో రెడ్ క్రాస్ వంటి సేవా సంస్థల అవసరం మరింత పెరిగింది. బాధలో ఉన్నవారికి అండగా నిలబడటం ప్రతి మనిషి బాధ్యత అనే సందేశాన్ని ఈ దినోత్సవం మరోసారి గుర్తు చేస్తోంది. మతం, జాతి, దేశం అనే తేడాలు లేకుండా మానవత్వంతో ముందుకు సాగితేనే సమాజం శాంతి, సౌభ్రాతృత్వంతో అభివృద్ధి చెందుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం మానవత్వానికి అద్దం పట్టే గొప్ప సందర్భంగా నిలుస్తోంది.

# యుద్ధ విజయం కాదు... శాంతియే నిజమైన గెలుపు

రెండో ప్రపంచ యుద్ధం ప్రపంచానికి ఎన్నో చేదు నిజాలను చూపించింది. అధికార దాహం, ఆధిపత్య రాజకీయాలు, జాతి విద్వేషం, మత అహంకారం ఎంతటి వినాశనానికి దారి తీస్తాయో ప్రపంచం ప్రత్యక్షంగా చూసింది. నగరాలు నేలమట్టమయ్యాయి. లక్షలాది కుటుంబాలు వీధినపడ్డాయి. చిన్నారులు అనాథలయ్యారు. కోట్లాది మంది ఆకలి, వ్యాధులు, నిరాశ్రయ జీవితం మధ్య నరకయాతన అనుభవించారు. యుద్ధం ముగిసినా ఆ గాయాలు తరాల పాటు మానవ సమాజాన్ని వెంటాడాయి. వీఈ దినోత్సవం కేవలం ఒక చారిత్రక సంఘటనను గుర్తు చేసుకునే రోజు కాదు. యుద్ధం ఎప్పటికీ పరిష్కారం కాదనే హెచ్చరిక. బాంబులు పేలిన ప్రతి నేలపై కన్నీళ్లు పడ్డాయి. తుపాకులు మోగిన ప్రతి చోట మానవత్వం ఓడిపోయింది. విజయం సాధించిన దేశాలు కూడా అపార నష్టాన్ని ఎదుర్కొన్నాయి. యుద్ధంలో అసలు గెలుపొందేది ఎవరూ లేరనే నిజాన్ని ప్రపంచం అప్పుడు గ్రహించింది.



నేటి ప్రపంచ పరిస్థితులు చూస్తే మరోసారి ఆందోళన కలుగుతోంది. దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. సరిహద్దు వివాదాలు, అణ్వాయుధ పోటీ, ఉగ్రవాదం, ఆర్థిక ఆధిపత్య పోరాటాలు ప్రపంచాన్ని మళ్లీ ప్రమాదకర దిశగా నెడుతున్నాయి. శాంతి చర్చల కంటే యుద్ధ భాష ఎక్కువగా వినిపించడం ఆందోళనకరం. ఒకప్పుడు రెండో ప్రపంచ యుద్ధం చూసిన భయంకర పరిస్థితులు మళ్లీ పునరావృతం కాకుండా ప్రపంచ దేశాలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న యుద్ధాలు, ఘర్షణలు అమాయక ప్రజల జీవితాలను ఛిన్నాభిన్నం చేస్తున్నాయి. రాజకీయ నిర్ణయాల మూలంగా సామాన్య ప్రజలే ఎక్కువగా నష్టపోతున్నారు. యుద్ధాలు ప్రారంభించేవారు అధికార కేంద్రాల్లో సురక్షితంగా ఉంటారు. కానీ ప్రాణాలు కోల్పోయేది సైనికులు, పిల్లలు, మహిళలు, నిరుపేద ప్రజలే. అందుకే శాంతి విలువను ప్రతి దేశం అర్థం చేసుకోవాలి. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ప్రపంచ దేశాలు ఐక్యరాజ్యసమితిని ఏర్పాటు చేశాయి. భవిష్యత్తులో ఇలాంటి విపత్తులు మళ్లీ జరగకుండా ఉండాలనే లక్ష్యంతో ప్రపంచ వేదికను నిర్మించాయి. కానీ ఇప్పటికీ ప్రపంచంలో ఘర్షణలు ఆగకపోవడం బాధాకరం. అంతర్జాతీయ సంస్థలు మరింత సమర్థంగా పనిచేయాల్సిన అవసరం ఉంది. దేశాల మధ్య చర్చలు, దౌత్య సంబంధాలు బలపడితేనే యుద్ధాలను నివారించవచ్చు.

యుద్ధాల ప్రభావం కేవలం ప్రాణనష్టంతోనే ఆగిపోదు. ఆర్థిక వ్యవస్థలు కుప్పకూలిపోతాయి. విద్య, వైద్యం, ఉపాధి వ్యవస్థలు దెబ్బతింటాయి. పర్యావరణం తీవ్రంగా నాశనం అవుతుంది. యుద్ధ ప్రాంతాల్లో పెరిగే పిల్లలు భయం మధ్య జీవించాల్సి వస్తుంది. వారి బాల్యం చీకటిలో కలిసిపోతుంది. ఈ పరిస్థితులు మానవ సమాజ భవిష్యత్తుపై తీవ్రమైన ప్రభావం చూపుతాయి.

నేటి తరానికి రెండో ప్రపంచ యుద్ధం ప్రత్యక్ష అనుభవం లేకపోయినా, చరిత్ర ఇచ్చిన పాఠాలను మరచిపోవద్దు. యుద్ధం ఎంతటి విధ్వంసాన్ని తెస్తుందో పుస్తకాల్లో మాత్రమే కాక సమాజంలో కూడా చర్చించాలి. పాఠశాలలు, విద్యాసంస్థలు శాంతి విలువను విద్యార్థులకు తెలియజేయాలి. మానవత్వం, సహనం, పరస్పర గౌరవం పెరిగితేనే ప్రపంచం సురక్షితంగా ఉంటుంది.

వీఈ దినోత్సవం సందర్భంగా సైనికుల త్యాగాలను స్మరించుకోవడం ఎంత ముఖ్యమో, యుద్ధాల వల్ల జరిగిన నష్టాన్ని గుర్తుంచుకోవడం కూడా అంతే అవసరం. ప్రాణత్యాగం చేసిన లక్షలాది మంది అమరవీరుల జ్ఞాపకాలు ప్రపంచానికి శాంతి అవసరాన్ని గుర్తు చేస్తున్నాయి. భవిష్యత్తు తరాలు యుద్ధ భయంకరతను చూడకూడదంటే దేశాలు శాంతి మార్గాన నడవాలి. ప్రపంచం నిజంగా అభివృద్ధి చెందాలంటే ఆయుధ పోటీ కాదు, మానవ అభివృద్ధి ముఖ్యం. బాంబుల తయారీకి ఖర్చు చేసే సంపదను విద్య, వైద్యం, పేదరిక నిర్మూలన కోసం వినియోగిస్తే ప్రపంచం మరింత సురక్షితంగా మారుతుంది. యుద్ధ విజయాల కంటే శాంతి విజయాలే మానవాళికి శాశ్వత గౌరవాన్ని తీసుకొస్తాయి. వీఈ దినోత్సవం ప్రతి ఏడాది ప్రపంచానికి ఇదే గొప్ప సందేశాన్ని గుర్తు చేస్తోంది.

# రైతుల కోసం ప్రశ్నిస్తే కేసులా..?



కేటీఆర్‌పై కేసు నమోదు చేయడాన్ని ఖండించిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డి

**హన్మకొండ,మే7(తెలంగాణ ముచ్చట్లు):** హన్మకొండలో వీడియో సందేశం విడుదల చేసిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డి సుబేదారి పోలీస్ స్టేషన్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. రైతుల పక్షాన నిలబడి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే కేసులు పెడతారా అంటూ ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రాజ్యం పేరుతో రాక్షస రాజ్యం నడుపుతోందని ఆరోపించారు. రైతు డిక్లరేషన్ అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని, కానీ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై కేసులు పెట్టడంలో మాత్రం వందకు వంద మార్కులు సాధించిందని విమర్శించారు. రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయలేకపోతే క్షమాపణ చెప్పాలని, అంతేగానీ అక్రమ కేసులు పెట్టడం సరికాదన్నారు. ప్రశ్నించే వారిపై కేసులు పెట్టడం చేతకాని పాలకుల పని అని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి దమ్ముంటే మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి పంట కొనుగోలు కేంద్రాలను సందర్శించాలని, అప్పుడు రైతుల గోస తెలుస్తుందని అన్నారు. కేటీఆర్ వ్యాఖ్యలపై కేసులు పెట్టిన ప్రభుత్వం, ముఖ్యమంత్రి చేస్తున్న వ్యాఖ్యలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. చట్టాలు కాంగ్రెస్ నేతలకు మాత్రమే వర్తిస్తాయా అని నిలదీశారు. వ్యవసాయ మార్కెట్లు మూసివేసే పరిస్థితి రావడం రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమని విమర్శించిన రాకేష్ రెడ్డి, రైతుల సమస్యలను దాచిపెట్టేందుకు కేసుల రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. జగిత్యాలలో జరిగిన సభకు లక్షలాది మంది స్పందించగా, కాంగ్రెస్ కార్యక్రమాలకు ప్రజా మద్దతు లభించడం లేదని వ్యాఖ్యానించారు.

తెలంగాణ మాండలికంలో సాధారణంగా ఉపయోగించే పదాలను వక్రీకరించి కేసులు పెట్టడం హాస్యాస్పదమని అన్నారు. రైతులు వరి కుప్పల దగ్గర ప్రాణాలు కోల్పోతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని, రైతుల కోసం ఎన్ని కేసులకైనా కేటీఆర్ సిద్ధమని స్పష్టం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించిన ఆయన, బీఆర్ఎస్‌పై అక్రమ కేసులు కొత్త కాదని పేర్కొన్నారు. చివరగా రైతు బంధు పాలన మళ్లీ రావాలని ఆకాంక్షించారు.



## సమాజ చైతన్యానికి కృషి చేస్తున్న జర్నలిస్టులకు సత్కారం

**హుజురాబాద్, మే 07 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి సమాజంలో చైతన్యం కల్పించడంలో పాత్రికేయుల పాత్ర ఎంతో కీలకమని ఇల్లంతకుంట దేవస్థానం చైర్మన్ ఇంగిలి రామారావు అన్నారు. గురువారం ఇల్లంతకుంట దేవస్థానం ఆధ్వర్యంలో ప్రజా ప్రతిభ పత్రికకు చెందిన పాత్రికేయులు ఇప్పకాయల సాగర్, చిలుకమారి శ్రీనివాస్‌లను దేవాలయానికి ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా దేవస్థానం అధికారులు వారికి శాలువాలు కప్పి, మెమొంటోలు అందజేసి అభినందనలు తెలిపారు. ప్రజా ప్రతిభ పత్రిక ద్వారా ప్రజా సమస్యలు, సామాజిక అంశాలు, గ్రామీణ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎప్పటికప్పుడు వెలుగులోకి తీసుకువస్తూ ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారని కొనియాడారు. ప్రజల గొంతుకగా నిలుస్తూ సమాజ అభివృద్ధికి కృషి చేస్తున్న పాత్రికేయులను ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవస్థానం సభ్యులు, స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.



## జగత్‌పల్లి సర్పంచ్ పెంటన్న యాదవ్‌ను పరామర్శించిన డా. జిల్లెల ఆదిత్యరెడ్డి

**పెద్దమండడి,మే7(తెలంగాణ ముచ్చట్లు):** హైదరాబాద్‌లోని అపోలో డిఆర్డిఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పెద్దమండడి మండలం జగత్‌పల్లి గ్రామ సర్పంచ్, మాజీ పెద్దమండడి మండల అధ్యక్షుడు పెంటన్న యాదవ్‌ను ఏఐపిసి రాష్ట్ర అధ్యక్షుడు డా. జిల్లెల ఆదిత్యరెడ్డి గురువారం పరామర్శించారు. ఆసుపత్రికి వెళ్లిన ఆయన పెంటన్న యాదవ్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్యులతో ప్రత్యేకంగా మాట్లాడిన డా. ఆదిత్యరెడ్డి, పెంటన్న యాదవ్‌కు అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని కోరారు.ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి మెరుగ్గా ఉందని వైద్యులు తెలిపినట్లు సమాచారం. పెంటన్న యాదవ్ త్వరగా కోలుకుని మళ్లీ ప్రజల మధ్యకు రావాలని ఆకాంక్షించారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# హోర్ముజ్ జలసంధి తెరుచుకునే దిశగా కీలక ముందడుగు

ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై కీలక ప్రభావం చూపే హోర్ముజ్ జలసంధి పరిస్థితిలో కీలక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. కొద్ది రోజులుగా మూసివేసిన ఈ సముద్ర మార్గాన్ని మళ్లీ తెరవడానికి అమెరికా, ఇరాన్ దేశాల మధ్య చర్చలు తుది దశకు చేరుకున్నట్లు అంతర్జాతీయ వర్గాలు సూచిస్తున్నాయి. ఈ పరిణామం ప్రపంచ దేశాలకు గుడ్ న్యూస్‌గా భావిస్తున్నారు. హోర్ముజ్ జలసంధి అంతర్జాతీయ చమురు రవాణాకు ప్రధాన ద్వారం కావడంతో, దీని మూసివేత ప్రపంచ మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపింది. ఇప్పుడు ఈ జలసంధిని దశలవారీగా తిరిగి అందుబాటులోకి తీసుకురావాలని ఇరు దేశాలు నిర్ణయించినట్లు సమాచారం. వచ్చే ఒకటి రెండు రోజుల్లో పూర్తి ఒప్పందం కుదిరే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఫిబ్రవరి 28న ప్రారంభమైన ఉద్రిక్త పరిస్థితుల కారణంగా ఈ జలసంధి పూర్తిగా మూసివేయబడింది. మధ్యలో కొద్ది గంటలపాటు మాత్రమే తెరిచిన సందర్భాలు ఉన్నప్పటికీ, పరిస్థితులు త్వరగా మారడంతో తిరిగి మూసివేయబడింది. దీంతో అనేక వాణిజ్య నౌకలు అక్కడే నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో చిక్కుకుపోయిన నౌకలను రక్షించేందుకు అమెరికా "ప్రాజెక్ట్ ఫ్రీడమ్" పేరిట ప్రత్యేక చర్యలు చేపట్టింది. వాణిజ్య నౌకలకు భద్రత కల్పించేందుకు యుద్ధ విమానాలను మోహరించాలనే ప్రణాళికలు కూడా రూపొందించాయి. అయితే చర్చలు సానుకూల దిశగా సాగుతుండటంతో ఈ ప్రాజెక్ట్‌ను తాత్కాలికంగా నిలిపివేసినట్లు సమాచారం. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ఇరాన్‌తో చర్చలు సానుకూలంగా కొనసాగుతున్నాయని వెల్లడించారు. ఈ పరిణామం వల్ల ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఉద్రిక్తతలు కొంతవరకు తగ్గే అవకాశం ఉంది. హోర్ముజ్ జలసంధి తిరిగి తెరుచుకుంటే అంతర్జాతీయ చమురు సరఫరా పునరుద్ధరించబడుతుంది. దీంతో చమురు ధరలు స్థిరపడే అవకాశముండగా, అనేక దేశాల ఆర్థిక వ్యవస్థలకు ఇది ఊరటనిచ్చే పరిణామంగా మారనుంది.




# బీహార్ మంత్రివర్గ విస్తరణ.. నితీశ్ కుమార్ కుమారుడికి మంత్రి పదవి

బీహార్‌లో రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయి. రాష్ట్ర మంత్రివర్గాన్ని విస్తరించిన ఎన్డీఏ ప్రభుత్వం కొత్తగా 31 మంది మంత్రులతో ప్రమాణ స్వీకారం చేయించింది. ఈ కార్యక్రమంలో జేడీయూ అధినేత నితీశ్ కుమార్ కుమారుడు నిషాంత్ కుమార్ కూడా మంత్రి పదవీ ప్రమాణం చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గాంధీ మైదాన్ లో జరిగిన ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. గవర్నర్ సయ్యద్ అతా హస్నైన్ కొత్త మంత్రులతో ప్రమాణ స్వీకారం చేయించారు. డిప్యూటీ ముఖ్యమంత్రి విజయ్ కుమార్ సిన్హా, మాజీ మంత్రులు శ్రావణ్ కుమార్, అశోక్ చౌదరీ కూడా మంత్రులుగా ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, జేడీయూ నేత నితీశ్ కుమార్ హాజరుకావడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఎన్డీఏ కూటమిలో భాగమైన పలు పార్టీల నేతలు కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. గత నెలలో నితీశ్ కుమార్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన తర్వాత బీజేపీ నేతృత్వంలో కొత్త ప్రభుత్వం ఏర్పడింది. అనంతరం సమ్రాట్ చౌదరీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం బీహార్‌లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం కొనసాగుతోంది. ఎల్‌జేపీఆర్వీ, హెచ్ఏఎం, ఆర్ఎల్ఎం వంటి పార్టీలు కూడా ఎన్డీఏ కూటమిలో భాగస్వాములుగా ఉన్నాయి. తాజా మంత్రివర్గ విస్తరణతో రాష్ట్ర రాజకీయాల్లో కొత్త సమీకరణాలు ఏర్పడే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. నిషాంత్ కుమార్‌కు మంత్రి పదవి రావడం జేడీయూ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. భవిష్యత్ రాజకీయాల్లో ఆయనకు కీలక పాత్ర ఉండొచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# మమత సమావేశానికి 10 మంది ఎమ్మెల్యేల గైర్హాజరు

అసెంబ్లీ ఎన్నికల ఓటమి తర్వాత ఇప్పటికే ఒత్తిడిలో ఉన్న తృణమూల్ కాంగ్రెస్ లో తాజాగా కొత్త చర్చ మొదలైంది. పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ నిర్వహించిన కీలక సమావేశానికి పది మంది ఎమ్మెల్యేలు గైర్హాజరు కావడం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. ఎన్నికల ఫలితాల తర్వాత పార్టీ పరిస్థితి, భవిష్యత్ వ్యూహాలపై చర్చించేందుకు ఏర్పాటు చేసిన ఈ సమావేశం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో ప్రధాన అంశంగా మారింది. అసెంబ్లీ ఎన్నికల్లో టీఎంసీ నుంచి మొత్తం 80 మంది ఎమ్మెల్యేలు విజయం సాధించారు. అయితే మమతా బెనర్జీ నిర్వహించిన సమావేశానికి కేవలం 70 మంది మాత్రమే హాజరయ్యారు. దీంతో మిగిలిన పది మంది ఎమ్మెల్యేల గైర్హాజరు పార్టీలో అంతర్గత అసంతృప్తికి సంకేతమా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా ఎన్నికల ఓటమి తర్వాత పార్టీ శ్రేణుల్లో ఇప్పటికే నిరుత్సాహం నెలకొన్న సమయంలో ఈ పరిణామం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. సమావేశంలో పార్టీ భవిష్యత్ కార్యాచరణ, ప్రతిపక్షంగా అనుసరించాల్సిన వ్యూహాలు, కేడర్‌ను మళ్లీ చైతన్యపరచడం వంటి అంశాలపై చర్చ జరిగినట్లు సమాచారం. ఎన్నికల ఫలితాల తర్వాత కార్యకర్తల్లో నెలకొన్న నిరాశను తొలగించి పార్టీని బలోపేతం చేయడంపై మమతా



బెనర్జీ ప్రత్యేకంగా దృష్టి పెట్టినట్లు రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. అయితే సమావేశానికి గైర్హాజరైన ఎమ్మెల్యేలపై పలు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. కొందరు ఎమ్మెల్యేలు బీజేపీ వైపు వెళ్లే అవకాశాలు ఉన్నాయా అనే చర్చ కూడా రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. గతంలో పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో ఇలాంటి పరిణామాలు చోటుచేసుకున్న నేపథ్యంలో తాజా పరిణామం మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ ఊహాగానాలపై టీఎంసీ నాయకత్వం స్పందించింది. సమావేశానికి హాజరుకాలేని ఎమ్మెల్యేలు ముందుగానే సమాచారం ఇచ్చారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. వ్యక్తిగత కారణాలు, ఇతర కార్యక్రమాల వల్లే వారు రాలేకపోయారని స్పష్టం చేశాయి. పార్టీలో ఎలాంటి చీలిక లేదని కూడా టీఎంసీ నేతలు పేర్కొన్నారు. అయినప్పటికీ తాజా పరిణామాలు పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీశాయి. ఎన్నికల ఓటమి తర్వాత టీఎంసీ శక్తిని నిలబెట్టుకోవడంలో మమతా బెనర్జీ ఎలాంటి వ్యూహాలు అనుసరిస్తారన్నదానిపై రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. రానున్న రోజుల్లో పార్టీ అంతర్గత పరిస్థితులు ఎలా మారతాయన్నది రాజకీయంగా కీలకంగా మారనుంది

# ఉగ్రవాదానికి భారత్ గట్టి సమాధానం ఇస్తుంది : ప్రధాని

దేశ భద్రత విషయంలో భారత్ ఎప్పటికీ రాజీ పడదని ప్రధానమంత్రి మోదీ స్పష్టం చేశారు. ఉగ్రవాద శక్తులు దేశాన్ని భయపెట్టాలని ప్రయత్నించిన ప్రతీసారి భారత సైన్యం తగిన సమాధానం ఇస్తోందని తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌కు ఏడాది పూర్తైన సందర్భంగా ప్రధాని మోదీ దేశ ప్రజలను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా భారత సాయుధ దళాల ధైర్యసాహసాలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. పహల్గామ్‌లో అమాయక భారతీయులపై జరిగిన దాడి దేశాన్ని తీవ్రంగా కలచివేసిందని మోదీ పేర్కొన్నారు. ఆ ఘటన తర్వాత భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ ఉగ్రవాద శక్తులకు గట్టి హెచ్చరికగా నిలిచిందని చెప్పారు. ఈ ఆపరేషన్‌లో సైనికులు అసాధారణ ధైర్యం, కచ్చితత్వం, వ్యూహాత్మక నైపుణ్యాన్ని ప్రదర్శించారని కొనియాడారు. దేశ ప్రజల భద్రత కోసం రాత్రింబవళ్లు కష్టపడుతున్న జవాన్లకు ప్రతి భారతీయుడు రుణపడి ఉంటాడని పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ భారత్ సైనిక సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పిందని మోదీ అన్నారు. భూసేన, నౌకాదళం, వైమానిక దళం సమన్వయంతో ఈ ఆపరేషన్ విజయవంతమైందని చెప్పారు. సరిహద్దుల్లో దేశాన్ని కాపాడేందుకు సైనికులు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు.



దేశ భద్రత కోసం తమ జీవితాలను అంకితం చేసిన వీర జవాన్ల త్యాగాలను ఎప్పటికీ మరవలేమని అన్నారు. స్వదేశీ రక్షణ రంగాన్ని బలోపేతం చేయడం వల్లే భారత సైన్యం మరింత శక్తివంతంగా మారుతోందని ప్రధాని వివరించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న కొత్త విధానాలతో రక్షణ రంగంలో స్వయం సమృద్ధి పెరుగుతోందని చెప్పారు. దేశీయంగా తయారవుతున్న ఆయుధాలు, సాంకేతిక పరిజ్ఞానం వల్ల భారత సైనిక దళాల సామర్థ్యం మరింత పెరిగిందని వెల్లడించారు. ప్రపంచ దేశాలు కూడా ఇప్పుడు భారత్ రక్షణ రంగాన్ని గౌరవంతో చూస్తున్నాయని పేర్కొన్నారు. ఉగ్రవాదాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మోదీ స్పష్టం చేశారు. దేశంపై దాడి చేసే శక్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హెచ్చరించారు. భారత భూభాగం, ప్రజల భద్రతకు ముప్పు కలిగించే శక్తులపై కఠిన చర్యలు తప్పవని అన్నారు. దేశ సమగ్రత, సార్వభౌమత్వాన్ని కాపాడటం ప్రతి భారతీయుడి బాధ్యత అని పిలుపునిచ్చారు. సైనిక దళాలకు గౌరవ సూచకంగా ప్రజలు తమ సామాజిక మాధ్యమాల ఖాతాల్లో ప్రత్యేక చిత్రాలను ప్రదర్శించాలని ప్రధాని సూచించారు. సైనికుల త్యాగాల వల్లే దేశ ప్రజలు ప్రశాంతంగా జీవిస్తున్నారని అన్నారు. యువత దేశభక్తి భావనతో ముందుకు రావాలని, దేశ రక్షణలో తమ వంతు బాధ్యతను గుర్తుంచుకోవాలని సూచించారు. ఇదిలా ఉండగా, ఈ నెల 10న బెంగళూరులో జరిగే ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ 45వ వార్షికోత్సవ కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొననున్నారు.

# తమిళనాడులో రాజకీయ ఉత్కంఠ.. విజయ్‌కు గవర్నర్ కీలక ప్రశ్నలు



తమిళనాడులో రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయి. టీవీకే అధినేత విజయ్ మరోసారి లోక్ భవన్‌కు వెళ్లి గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ ను కలిశారు. రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు అవకాశం ఇవ్వాలని కోరినట్లు సమాచారం. అసెంబ్లీలో మెజార్టీ నిరూపించుకునేందుకు తాను సిద్ధంగా ఉన్నానని ఈ సందర్భంగా గవర్నర్‌కు తెలిపినట్లు రాజకీయ వర్గాలు పేర్కొన్నాయి. ఈ భేటీలో గవర్నర్ విజయ్‌ను పలు కీలక ప్రశ్నలు అడిగినట్లు తెలుస్తోంది. మెజార్టీ మార్క్ 118 కాగా 113 మంది ఎమ్మెల్యేలతో స్థిరమైన ప్రభుత్వాన్ని ఎలా నడుపుతారని ప్రశ్నించినట్లు సమాచారం. అదనపు మద్దతు కోసం ఇతర పార్టీలతో చర్చలు జరిగాయా అని కూడా అడిగినట్లు రాజకీయ వర్గాలు వెల్లడించాయి. అయితే బలపరీక్ష నిర్వహిస్తే తాను మెజార్టీ నిరూపించగలనని విజయ్ స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. అనంతరం ప్రమాణస్వీకారానికి గవర్నర్ సానుకూల సంకేతాలు ఇచ్చినట్లు సమాచారం. ఎన్నికల ఫలితాల తర్వాత రెండు రోజుల వ్యవధిలోనే విజయ్, గవర్నర్ మధ్య ఇది రెండో భేటీ కావడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఇప్పటికే కాంగ్రెస్ మద్దతు ప్రకటించిన నేపథ్యంలో ఇతర పార్టీల వైఖరి కూడా ఆసక్తికరంగా మారింది. విడుదలై చిరుతైగళ్ కచ్చి టీవీకేకు తొలి అవకాశం ఇవ్వాలని గవర్నర్‌ను కోరినట్లు సమాచారం. అయితే ప్రభుత్వ ఏర్పాటుకు పూర్తి మద్దతుపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు. మరోవైపు డీఎంకే కూడా సంప్రదాయం ప్రకారం ముందుగా టీవీకేకు అవకాశం ఇవ్వాలని అభిప్రాయం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. రెండు ఎమ్మెల్యేలున్న వీసీకే, సీపీఐ సానుకూలంగా స్పందించినప్పటికీ అధికారిక ప్రకటన చేయలేదు. దీంతో తమిళనాడులో ప్రభుత్వ ఏర్పాటుపై ఇంకా ఉత్కంఠ కొనసాగుతోంది. రాజకీయ సమీకరణాలు ఎలా మారతాయన్న దానిపై రాష్ట్రవ్యాప్తంగా చర్చ నడుస్తోంది. ఇదిలా ఉండగా ముఖ్యమంత్రికి కేటాయించే పోలీసు కాన్వాయ్‌ను విజయ్ తిరస్కరించడం కూడా చర్చనీయాంశంగా మారింది. ప్రమాణస్వీకారానికి ముందే ఆ సౌకర్యం అవసరం లేదని విజయ్ చెప్పినట్లు టీవీకే వర్గాలు తెలిపాయి. అయితే కాన్వాయ్‌ను వెనక్కి తీసుకున్నారన్న వార్తలను పోలీసులు ఖండించారు. ప్రోటోకాల్ ప్రకారం ఇచ్చిన వాహనాలను విజయ్ స్వయంగా వద్దన్నారని అధికారులు వెల్లడించారు.

# గ్రామీణ బ్యాంకులకు కొత్త సంస్కరణలు




ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల పనితీరును మరింత బలోపేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గ్రామీణ బ్యాంకుల్లో సంస్కరణల కోసం రూపొందించిన 'వయబిలిటీ ప్లాన్ 2.0'కు కేంద్ర ఆర్థిక సేవల విభాగం ఆమోదం తెలిపింది. ఈ ప్రణాళిక 202526 నుంచి 202728 ఆర్థిక సంవత్సరాల వరకు అమల్లో ఉండనుంది.

ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల ఆర్థిక స్థితి, పరిపాలనా వ్యవస్థ, పనితీరు పర్యవేక్షణను మెరుగుపరచడమే ఈ ప్రణాళిక ప్రధాన లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. గతంలో 202122 నుంచి 202425 వరకు అమలైన తొలి వయబిలిటీ ప్రణాళిక మంచి ఫలితాలు ఇవ్వడంతో ఇప్పుడు దాన్ని మరింత విస్తృతంగా అమలు చేయాలని నిర్ణయించారు.

కొత్త ప్రణాళికలో మొత్తం 30 పనితీరు ప్రమాణాలను చేర్చారు. కార్యాచరణ సామర్థ్యం, ఆస్తుల నాణ్యత, లాభదాయకత, వృద్ధి వంటి నాలుగు ప్రధాన అంశాల ఆధారంగా బ్యాంకుల పనితీరును అంచనా వేయనున్నారు. డిపాజిట్లు, రుణాల నిష్పత్తి, డిజిటల్ సేవల వినియోగం, రికవరీ శాతం, లాభదాయకత, కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు వంటి అంశాలను ప్రత్యేకంగా పరిశీలించనున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలను మరింత బలోపేతం చేయడం, డిజిటల్ బ్యాంకింగ్‌ను విస్తరించడం, రైతులు మరియు గ్రామీణ ప్రజలకు రుణ సదుపాయాలను సులభతరం చేయడం ఈ ప్రణాళికలో కీలక భాగంగా ఉండనుంది. దేశవ్యాప్తంగా ఉన్న 28 ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల ఆర్థిక స్థిరత్వాన్ని పెంచడంతో పాటు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు మరింత మద్దతు అందించడంలో ఈ సంస్కరణలు కీలకంగా మారనున్నాయని అధికారులు భావిస్తున్నారు.

# ఇంధన ధరలపై కేంద్రం కీలక నిర్ణయం



అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు పెరుగుతున్నప్పటికీ దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలను స్థిరంగా కొనసాగించేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సామాన్య ప్రజలపై అదనపు భారం పడకుండా చమురు మార్కెటింగ్ సంస్థలు భారీ నష్టాలను భరిస్తున్నట్లు సమాచారం.

ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ చమురు ధర బ్యారెల్‌కు 102 డాలర్ల వద్ద కొనసాగుతోంది. భారత్ అధికంగా దిగుమతులపై ఆధారపడటం వల్ల అంతర్జాతీయ ధరల ప్రభావం దేశీయ మార్కెట్‌పై తీవ్రంగా పడుతోంది. అయినప్పటికీ పెట్రోల్‌పై లీటరుకు సుమారు రూ.14, డీజిల్‌పై రూ.18 వరకు నష్టాలను చమురు సంస్థలు భరిస్తున్నట్లు తెలుస్తోంది.

డాలర్‌తో రూపాయి మారకపు విలువలో మార్పులు కూడా ఇంధన ధరలపై ప్రభావం చూపుతున్నాయి. రూపాయి బలహీనపడితే దిగుమతి వ్యయం పెరిగి, చమురు సంస్థలపై మరింత ఒత్తిడి పడుతోంది. అలాగే కేంద్ర ఎక్సైజ్ సుంకం, రాష్ట్ర ప్రభుత్వాల వ్యాట్ పన్నుల కారణంగా రాష్ట్రాల వారీగా ఇంధన ధరల్లో తేడాలు కనిపిస్తున్నాయి.

మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులు, ఇరాన్‌అమెరికా మధ్య జరుగుతున్న చర్చలు ప్రపంచ చమురు మార్కెట్‌ను ప్రభావితం చేస్తున్నాయి. హార్ముజ్ జలసంధి మార్గంలో చమురు సరఫరా పునరుద్ధరణపై అంతర్జాతీయంగా ఆశలు ఉన్నప్పటికీ పరిస్థితులు ఇంకా పూర్తిగా సాధారణ స్థితికి రాలేదు.

ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం గృహ వినియోగదారులకు ఊరటనిచ్చే నిర్ణయం తీసుకుంది. 14.2 కిలోల గృహ వినియోగ ఎల్‌పీజీ సిలిండర్ ధరను ప్రస్తుతం ఉన్న స్థాయిలోనే కొనసాగిస్తోంది. ఢిల్లీలో గృహ వినియోగ సిలిండర్ ధర రూ.913గానే ఉంది.

అయితే వాణిజ్య వినియోగదారులకు మాత్రం ధరల పెరుగుదల తప్పలేదు. 19 కిలోల కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్ ధరను సగటున రూ.993 వరకు పెంచినట్లు సమాచారం. దీంతో హోటళ్లు, రెస్టారెంట్లు, చిన్న వ్యాపారాలపై అదనపు భారం పడే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# యుద్ధ ప్రభావంతో బైక్ మార్కెట్‌కు షాక్



పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులు దేశీయ ఆటోమొబైల్ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ బజాజ్ ఆటో వెల్లడించింది. ముఖ్యంగా మోటార్‌సైకిళ్లు, ఎంట్రీ లెవల్ బైకులు, స్కూటర్లకు డిమాండ్ తగ్గే ప్రమాదం ఉందని సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాకేశ్ శర్మ తెలిపారు. గత కొన్ని నెలలుగా వినియోగదారుల కొనుగోలు ఆసక్తి క్రమంగా తగ్గుతోందని ఆయన పేర్కొన్నారు. అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావంతో ఇంధన ధరలు, వంటగ్యాస్ ధరలు పెరగడం ప్రజల ఖర్చులపై ఒత్తిడి పెంచిందన్నారు. దీంతో కొత్త వాహనాల కొనుగోలుపై వినియోగదారులు వెనక్కి తగ్గుతున్నారని వివరించారు.

గత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో మోటార్‌సైకిల్ విభాగం 20 శాతం వృద్ధిని నమోదు చేసినప్పటికీ, ఈసారి మాత్రం సింగిల్ డిజిట్ వృద్ధికే పరిమితం కావచ్చని అంచనా వేశారు. మధ్యప్రాచ్య సంక్షోభం కారణంగా సరఫరా వ్యవస్థలో సమస్యలు తలెత్తడంతో పాటు ద్రవ్యోల్బణం కూడా పెరిగిందన్నారు.

కార్మికుల కొరత కూడా ఆటోమొబైల్ రంగాన్ని ప్రభావితం చేస్తోందని రాకేశ్ శర్మ తెలిపారు. ముడి సరుకుల ధరలు పెరగడంతో వాహన తయారీ వ్యయం అధికమైందని, ఇప్పటికే పలు కంపెనీలు ధరలు పెంచినట్లు చెప్పారు.

జీఎస్టీ ప్రయోజనాల కంటే వాహన ధరల పెరుగుదల 30 నుంచి 40 శాతం వరకు అధికంగా ఉందన్నారు.

అయితే 150 సీసీ కంటే ఎక్కువ సామర్థ్యం కలిగిన ప్రీమియం బైకులకు మాత్రం డిమాండ్ కొనసాగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ విభాగంలో బజాజ్ ఆటో బలంగా ఉందని, ఇండస్ట్రీ సగటు కంటే మెరుగైన వృద్ధిని నమోదు చేస్తున్నట్లు తెలిపారు.

మరోవైపు ఎలక్ట్రిక్ స్కూటర్లకు మంచి డిమాండ్ కొనసాగుతోందన్నారు. గత ఏడాది చివరి త్రైమాసికంలో కంపెనీ ఎలక్ట్రిక్ స్కూటర్ల విక్రయాలు 40 శాతం పెరిగాయని, ఏప్రిల్ నెలలో 60 శాతం వృద్ధి నమోదైందని వెల్లడించారు.

ఇదిలా ఉండగా బజాజ్ ఆటో ఆర్థిక ఫలితాలు మాత్రం ఆకట్టుకున్నాయి. మార్చితో ముగిసిన త్రైమాసికంలో కంపెనీ నికర లాభం రూ.3,492 కోట్లకు చేరింది. గత ఏడాదితో పోలిస్తే ఇది దాదాపు రెండింతలు పెరిగినట్లు సంస్థ వెల్లడించింది. కంపెనీ ఆదాయం కూడా రూ.17,832 కోట్లకు పెరిగింది.

# గల్ఫ్ ఉద్రిక్తతలతో మార్కెట్‌లో ఒడిదుడుకులు




దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం స్వల్ప నష్టాలతో ముగిశాయి. రోజంతా పరిమిత శ్రేణిలో కదలాడిన సూచీలు చివరికి ఫ్లాట్ ధోరణిలో స్థిరపడ్డాయి. అంతర్జాతీయంగా గల్ఫ్ ప్రాంత పరిణామాలు, అమెరికాఇరాన్ చర్చలపై ఇన్వెస్టర్లు దృష్టి సారించడంతో మార్కెట్లో జాగ్రత్త ధోరణి కనిపించింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 114 పాయింట్లు తగ్గి 77,844.52 వద్ద నిలిచింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా స్వల్పంగా 4.30 పాయింట్లు కోల్పోయి 24,326.65 వద్ద ముగిసింది. ప్రధాన సూచీలు బలహీనంగా కనిపించినప్పటికీ, బ్రాడర్ మార్కెట్లు మాత్రం లాభాల్లో కొనసాగాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 1.20 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.97 శాతం మేర పెరిగాయి. ఇది మధ్యతరహా, చిన్నతరహా షేర్లలో కొనుగోళ్ల ఆసక్తి కొనసాగుతున్నట్లు సూచిస్తోంది. రంగాల వారీగా ఆటో షేర్లు మంచి ప్రదర్శన కనబరిచాయి. మరోవైపు ఐటీ, ఎఫ్ఎంసీజీ, కన్జ్యూమర్ డ్యూరబుల్స్ రంగాలు ఒత్తిడికి లోనయ్యాయి. ముఖ్యంగా హిందుస్థాన్ యూనిలీవర్, టీసీఎస్, టైటన్ వంటి ప్రముఖ కంపెనీల షేర్లు నష్టాల్లో ముగియడంతో సూచీలపై ప్రభావం పడింది. మార్కెట్ నిపుణుల ప్రకారం నిఫ్టీకి 24,400 నుంచి 24,500 స్థాయిలు కీలక అవరోధంగా మారాయి. ఈ స్థాయిని అధిగమిస్తే మార్కెట్ మరింత పుంజుకునే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు. మరోవైపు అమ్మకాల ఒత్తిడి పెరిగితే 24,000 స్థాయి కీలక మద్దతుగా నిలవొచ్చని అంచనా వేస్తున్నారు. ఇదిలా ఉండగా అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు భారీగా తగ్గాయి. అమెరికాఇరాన్ మధ్య ఒప్పందం కుదిరే అవకాశాలపై వచ్చిన వార్తలతో బ్రెంట్ క్రూడ్ ధర 2.74 శాతం తగ్గి బ్యారెల్‌కు 98.50 డాలర్లకు చేరింది. చమురు ధరలు తగ్గడంతో పాటు అంతర్జాతీయ సానుకూల సంకేతాల ప్రభావంతో రూపాయి కూడా బలపడింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 15 పైసలు పెరిగి 94.24 వద్ద ట్రేడింగ్ ముగించింది.

# ఈవీ వాహనాలకు పెరుగుతున్న ఆదరణ

దేశవ్యాప్తంగా ఎలక్ట్రిక్ వాహనాలకు డిమాండ్ వేగంగా పెరుగుతోంది. పెరుగుతున్న ఇంధన ధరలు, పర్యావరణంపై అవగాహన పెరగడం, ప్రభుత్వ ప్రోత్సాహకాల ప్రభావంతో వినియోగదారులు ఈవీల వైపు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. దీంతో గత నెలలో ఎలక్ట్రిక్ ప్యాసింజర్ వాహనాల విక్రయాలు రికార్డు స్థాయికి చేరుకున్నాయని ఆటోమొబైల్ డీలర్ల సంఘాల సమాఖ్య వెల్లడించింది. ఏప్రిల్ నెలలో దేశవ్యాప్తంగా 23,506 ఎలక్ట్రిక్ ప్యాసింజర్ వాహనాలు విక్రయమైనట్లు తెలిపింది. గత ఏడాది ఇదే నెలలో నమోదైన 13,421 యూనిట్లతో పోలిస్తే ఇది 75 శాతం కంటే ఎక్కువ వృద్ధి అని పేర్కొంది.

ఈ విభాగంలో టాటా మోటార్స్ ముందంజలో నిలిచింది. కంపెనీ ఏప్రిల్‌లో 8,543 ఎలక్ట్రిక్ కార్లను విక్రయించింది. ఇది గత ఏడాదితో పోలిస్తే 77 శాతం అధికం. మహీంద్రా అండ్ మహీంద్రా 5,413 యూనిట్లు విక్రయించగా, జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటర్ కూడా సుమారు 5 వేల ఎలక్ట్రిక్ కార్లను విక్రయించింది.

కేవలం కార్లే కాకుండా ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలకు కూడా భారీ డిమాండ్ నమోదైంది. ఏప్రిల్‌లో దేశవ్యాప్తంగా 1,48,740 ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలు అమ్ముడయ్యాయి. గత ఏడాది ఇదే నెలతో పోలిస్తే ఇది దాదాపు 60 శాతం పెరుగుదల. ఈ విభాగంలో టీవీఎస్ మోటర్ కంపెనీ 37,683 యూనిట్లతో అగ్రస్థానంలో నిలిచింది. బజాజ్ ఆటో 32,898 వాహనాలు విక్రయించగా, ఏథర్ ఎనర్జీ 27,034 యూనిట్లు విక్రయించింది. అదేవిధంగా ఎలక్ట్రిక్ త్రిచక్ర వాహనాల విక్రయాలు కూడా పెరిగాయి. గత నెలలో 64,549 ఎలక్ట్రిక్ త్రిచక్ర వాహనాలు అమ్ముడయ్యాయి. ఎలక్ట్రిక్ కమర్షియల్ వాహనాల విక్రయాలు కూడా రెండింతలు పెరిగి 2,245 యూనిట్లకు చేరుకున్నాయి. ఇంధన ధరలు పెరుగుతుండటంతో పాటు ఛార్జింగ్ మౌలిక వసతులు మెరుగుపడటం, కొత్త మోడళ్లు మార్కెట్లోకి రావడం వల్ల రాబోయే నెలల్లో కూడా ఈవీ రంగం మరింత వేగంగా విస్తరించే అవకాశాలు కనిపిస్తున్నాయి.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక




# 'అగధ' టీజర్‌తో ఆసక్తి పెంచిన ఎంఎస్ రాజు

ప్రముఖ నిర్మాత, దర్శకుడు ఎంఎస్ రాజు మరోసారి విభిన్న కథతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఆయన దర్శకత్వంలో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'అగధ' ప్రస్తుతం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మిస్టికల్ డివైన్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ సినిమాలో కామాక్షి భాస్కర్ల ప్రధాన పాత్రలో నటిస్తుండగా, బాలీవుడ్ నటుడు శ్రవణ్ రెడ్డి, ఉల్కా గుప్తా, జోవికా విజయ్ కుమార్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. శ్రీ ఆది వరాహ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై కాశీ విశాలాక్షి బలుసు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా ప్రస్తుతం అనంతర నిర్మాణ పనులను శరవేగంగా జరుపుకుంటోంది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో సినిమాను విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

ఇటీవల విడుదలైన 'అగధ' టీజర్ ప్రేక్షకుల్లో సినిమాపై భారీ ఆసక్తిని పెంచుతోంది. టీజర్ ప్రారంభం నుంచే ఒక రహస్యభరిత వాతావరణాన్ని సృష్టిస్తూ ప్రేక్షకులను కథలోకి తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. ఆధ్యాత్మిక అంశాలు, థ్రిల్లింగ్ సన్నివేశాలు, మిస్టరీ ఎలిమెంట్స్ కలిసి టీజర్‌ను మరింత ఆకర్షణీయంగా మార్చాయి. ముఖ్యంగా నేపథ్య సంగీతం, ఛాయాగ్రహణం టీజర్‌కు ప్రధాన బలంగా నిలిచాయి. ప్రతి ఫ్రేమ్‌లోనూ ఏదో రహస్యం దాగి ఉన్నట్టుగా చూపించడం ద్వారా దర్శకుడు ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ పెంచడంలో సఫలమయ్యారు.

కామాక్షి భాస్కర్ల పాత్ర టీజర్‌లో చాలా ఇంటెన్స్‌గా కనిపిస్తోంది. ఆమె హావభావాలు, స్క్రీన్ ప్రెజెన్స్ సినిమాపై ప్రత్యేక ఆసక్తిని కలిగిస్తున్నాయి. అలాగే శ్రవణ్ రెడ్డి పాత్ర కూడా మిస్టరీ షేడ్‌తో కనిపిస్తూ కథలో కీలక మలుపులకు కారణమయ్యేలా అనిపిస్తోంది. ఉల్కా గుప్తా, జోవికా విజయ్ కుమార్ పాత్రలకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడించకపోయినా, టీజర్‌లో వారి లుక్స్ ఆకట్టుకుంటున్నాయి.

టీజర్ విడుదలైన వెంటనే సోషల్ మీడియాలో మంచి స్పందన వచ్చింది. "ఎంఎస్ రాజు నుంచి ఇలాంటి థ్రిల్లర్ ఊహించలేదు", "విజువల్స్ అద్భుతంగా ఉన్నాయి", "కామాక్షి భాస్కర్ల పాత్ర చాలా డిఫరెంట్‌గా కనిపిస్తోంది" అంటూ సినీ అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. టీజర్‌తోనే సినిమాపై అంచనాలు పెంచిన 'అగధ' విడుదల తర్వాత ఎలాంటి సంచలనం సృష్టిస్తుందో చూడాలని ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



# 'ఆ పాత్రకు నేను సెట్ కాలేదు'.. సాయి పల్లవి ఆసక్తికర వ్యాఖ్యలు

సహజ నటనతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న సాయి పల్లవి ప్రస్తుతం వరుస భారీ చిత్రాలతో బిజీగా ఉన్నారు. తెలుగు, తమిళంతో పాటు బాలీవుడ్‌లోనూ పలు ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల్లో నటిస్తూ కెరీర్‌ను విజయవంతంగా కొనసాగిస్తున్నారు. అయితే తాజాగా ఆమె చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ప్రస్తుతం సాయి పల్లవి బాలీవుడ్‌లో రూపొందుతున్న 'రామాయణం' చిత్రంలో సీత పాత్రలో నటిస్తున్నారు. ఈ సినిమాలో రణబీర్ కపూర్ శ్రీరాముడి పాత్రలో కనిపించనుండగా, ఈ చిత్రం రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇదే సమయంలో అమీర్ ఖాన్ కుమారుడు జునైద్ ఖాన్ హీరోగా తెరకెక్కిన 'ఏక్ దిన్' సినిమాలో కూడా ఆమె నటించారు. ఇటీవల విడుదలైన 'ఏక్ దిన్' సినిమా ప్రేక్షకుల నుంచి మిశ్రమ స్పందన అందుకుంది. ఈ నేపథ్యంలో ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన సాయి పల్లవి సినిమాకు సంబంధించిన ఆసక్తికర విషయాలను వెల్లడించారు. "ఈ సినిమా చేయడానికి ప్రధాన కారణం కథే. భావోద్వేగాలతో కూడిన, మనసుకు హాయిగా అనిపించే పాత్ర చేయాలనిపించింది. షూటింగ్ సమయంలో కూడా మానసిక ఒత్తిడి లేకుండా ఉండే కథ కావాలనుకున్నాను. కథ విన్నప్పుడు హాలీవుడ్ చిత్రం 'బిఫోర్ సన్‌రైజ్' గుర్తుకు వచ్చింది. అందుకే వెంటనే అంగీకరించాను" అని తెలిపారు. అయితే సినిమా ప్రీమియర్ చూసిన తర్వాత తనకు భిన్నమైన భావన కలిగిందని సాయి పల్లవి చెప్పారు. "సినిమా చూసాక ఈ పాత్రకు నేను పూర్తిగా సరిపోలేదేమో అనిపించింది. ఇదే విషయాన్ని అమీర్ ఖాన్ గారితో కూడా చెప్పాను. నా బదులు మరింత చలాకీగా, ఉత్సాహంగా ఉండే కొత్త అమ్మాయిని ఎంపిక చేసి ఉంటే బాగుండేదేమో అనిపించింది" అని వెల్లడించారు. సాయి పల్లవి చేసిన ఈ నిజాయితీ వ్యాఖ్యలు ప్రస్తుతం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. తన నటనపై స్వయంగా విశ్లేషించుకోవడం, పాత్రకు తాను ఎంతవరకు న్యాయం చేశానో బహిరంగంగా చెప్పడం ఆమె వ్యక్తిత్వాన్ని చూపిస్తోందని అభిమానులు కామెంట్లు చేస్తున్నారు.



# శ్రియ అందాల మెరుపులు

సీనియర్ హీరోయిన్ శ్రియ శరణ్ భారతీయ సినీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నారు. రెండు దశాబ్దాలకుపైగా సినీ ప్రయాణాన్ని విజయవంతంగా కొనసాగిస్తూ ఇప్పటికీ ప్రేక్షకులను అలరిస్తున్నారు. అందం, అభినయం, గ్లామర్‌తో పాటు విభిన్న పాత్రలను పోషిస్తూ తన ప్రత్యేకతను నిలబెట్టుకున్నారు.

శ్రియ సినీ ప్రయాణం బాలీవుడ్ చిత్రం 'తుఝే మేరీ కసమ్'తో ప్రారంభమైంది. అనంతరం విక్రమ్ కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన 'ఇష్టం' సినిమాతో తెలుగు తెరకు పరిచయమయ్యారు. మొదటి సినిమాతోనే తన అందం, నటనతో ప్రేక్షకుల మనసులు గెలుచుకున్న శ్రియ.. ఆ తర్వాత వరుస అవకాశాలను అందుకున్నారు.

తెలుగులో మెగాస్టార్ చిరంజీవి, నాగార్జున, వెంకటేశ్, బాలకృష్ణ, ప్రభాస్, జూనియర్ ఎన్టీఆర్, మహేష్ బాబు వంటి అగ్రహీరోల సరసన నటించి స్టార్ హీరోయిన్‌గా ఎదిగారు. తెలుగు మాత్రమే కాకుండా తమిళం, హిందీ, మలయాళ భాషల్లోనూ అనేక విజయవంతమైన చిత్రాల్లో నటించి దేశవ్యాప్తంగా అభిమానులను సంపాదించుకున్నారు. ప్రస్తుతం రెండో ఇన్నింగ్స్‌లోనూ శ్రియ అదే జోష్‌తో కొనసాగుతున్నారు. స్టార్ హీరోల సినిమాల్లో కీలక పాత్రలు పోషించడంతో పాటు మహిళా ప్రాధాన్య కథల్లో నటిస్తూ ప్రశంసలు అందుకుంటున్నారు. పాత్రల ఎంపికలో వైవిధ్యాన్ని చూపిస్తూ తన నటనతో మరోసారి ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు.

# కార్తీ కొత్త చిత్రానికి శ్రీకారం

తమిళ స్టార్ హీరో కార్తీ, టాలీవుడ్ యువ దర్శకుడు కళ్యాణ్ శంకర్ కాంబినేషన్‌లో రూపొందనున్న కొత్త చిత్రం నేడు హైదరాబాద్‌లో ఘనంగా ప్రారంభమైంది. ఇప్పటికే ఈ క్రేజీ ప్రాజెక్ట్‌పై సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొనగా, తాజా ముహూర్త కార్యక్రమంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రూపొందుతున్న ఈ చిత్రం పూజా కార్యక్రమాలతో అధికారికంగా పట్టాలెక్కింది. 'మ్యాడ్', 'మ్యాడ్ స్క్వేర్' చిత్రాలతో వరుస విజయాలు అందుకున్న దర్శకుడు కళ్యాణ్ శంకర్.. ఈసారి కార్తీతో భారీ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌ను తెరకెక్కించేందుకు సిద్ధమయ్యారు.

ఈ సినిమాలో కార్తీ సరసన మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటించనుంది. నేడు జరిగిన ముహూర్త కార్యక్రమానికి చిత్రబృంద సభ్యులతో పాటు పలువురు సినీ ప్రముఖులు హాజరైనట్లు సమాచారం. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో కలిసి ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది.

తెలుగులో కార్తీకి ఉన్న ప్రత్యేక అభిమాన వర్గం, దర్శకుడు కళ్యాణ్ శంకర్ హాస్య శైలి కలవడంతో ఈ సినిమాపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. వినోదం, యాక్షన్, భావోద్వేగాల మేళవింపుగా ఈ చిత్రం తెరకెక్కనున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి.

త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుండగా, నటీనటులు, సాంకేతిక నిపుణులకు సంబంధించిన పూర్తి వివరాలను మేకర్స్ త్వరలో వెల్లడించనున్నట్లు తెలుస్తోంది.



Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in